POSTAL REGD.NO.PRAKASAM/16/2024-2026
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
జనవరి 2025
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక
సంపుటి: 42 సంచిక: 09



శ్రీ స్వామి వివేకానంద జయంతి
(12.01.2025)

## ఈ నెల పండుగలు

జనవరి 10 - పరాడసింగా శ్రీ అనసూయ మాత ఆరాధన
జనవరి 12 - శ్రీ స్వామి వివేకానంద జయంతి
జనవరి 13 - భగవాన్ శ్రీ రమణ మహర్షి జయంతి (పుష్య పౌర్ణమి)
జనవరి 14 - సంక్రాంతి
జనవరి 16 - అవధూత శ్రీ రామిరెడ్డి తాత ఆరాధన
జనవరి 21 - శ్రీ స్వామివివేకానంద జయంతి (తిథి ప్రకారము- పుష్య బహుళ సప్తమి)
జనవరి 27 - తాజుద్దీన్ బాబా జయంతి



"అధమమైన మతవికారాన్ని నిరసించడానికి నిర్దుష్టము, హేతుబద్ధమైన నాస్తికవాదమెంత అవసరమో అలానే అంధమూ, మూర్ఖమూ అయిన నాస్తిక వికారాన్ని అరికట్టుకోడానికి సరైన ఆస్తిక దృక్పథమూ అంతే అవసరము. మానవ ప్రగతికి రెండూ ఆవశ్యకమే."

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

# ధర్మసూక్ష్మాలు తెలియాలంటే!

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

ధర్మశాస్త్రాలలో చెప్పబడిన ధర్మసూక్ష్మాలని సర్వధర్మజ్ఞులు, బ్రహ్మవేత్తలూ అయిన మహనీయులనుండి తెలుసుకోవాలని ధర్మశాస్త్రాలే చెపుతాయి. అలా చేయకపోవడంవలన మన సమాజంలో వర్ణవ్యవస్థ తారుమారై ప్రజా శ్రేయస్సుకు ఉపకరించే బదులు దేశానికి దౌర్భాగ్యంగా పరిణమించింది. సమాజంలో వర్ణభేదం జన్మనుబట్టి వస్తుందని తలచబడుతూంది. కానీ నిజానికది గుణాన్నిబట్టి కర్మలను బట్టి ఏర్పడిందని భగవద్గీతలో (4:13) చెప్పబడింది. అయినప్పటికీ 'పండితులు' దానిని వక్రించి వ్యాఖ్యానించారని బ్రహ్మవేత్తల బోధల వలన తెలుస్తుంది.

ఉదాహరణకు శిరిడీ సాయిబాబా, "మనలో ప్రతివారిలోను ఒక అంత్యజుడుంటాడు. వాణ్ణి వెళ్ళగొట్టాలి" అన్నారు. ఇక్కడ అంత్యజుడంటే 'అరిషడ్వర్గాలకు ప్రేరకమైన అజ్ఞానము, దాని ప్రత్యక్ష రూపమైన అహంకారము' అని మనము గుర్తించాలి. ఈ విషయాన్నే ఆయన మరొకసారి, "వసతి గృహంలోని దొంగలను కనిపెట్టాలి" అని చెప్పారు. జన్మజన్మకూ మారుతుండే అశాశ్వతమైన శరీరమే వసతి గృహము లేక సత్రము. అది ఎవరికీ స్థిరనివాసం కాజాలదు.

అలానే వారి సమకాలికులు, వారి మరొక రూపము అయిన శ్రీ అక్కల్ కోట స్వామి ఆ భావాన్నే సూచించారు. ఆయన దర్శనార్థం వచ్చిన ఒక సద్బ్రాహ్మణుడు విధిలేక ఒక హరిజనుడి ఇంటివద్ద కుండలోని నీటితో స్నానసంధ్యలు పూర్తిచేసుకొని, స్వామిని దర్శించి, బ్రాహ్మణ పంక్తిలో భోజనానికి కూర్చున్నాడు. అది గమనించిన స్వామి సేవకుడొకడు అతడలా చేసినందుకు తీవ్రంగా విమర్శించి, పంక్తిలోనుండి వెళ్ళగొట్టాడు. ఆ సద్బ్రాహ్మణుడు నొచ్చుకున్నాడు. తరువాత ఆ సేవకుడు స్వామికి యథావిధిగా భిక్ష యిచ్చినపుడు ఆయన స్వీకరించలేదు. తన నేరమేమని అడిగిన సేవకుని చేత ఆ హరిజనుని పిలిపించి, అతడి నొసట విభూతిపెట్టి, నేలమీద ఏడుగీతలు గీచి "ఒక్కొక్క గీటు దాటుతూ క్రిందటి జన్మలలో నీవెవరివో చెప్పు" అన్నారు. ఆ హరిజనుడు ఆ గీతలు దాటుతూ పూర్వజన్మ స్మృతిని పొంది వేరువేరు జన్మలలో వివిధ వర్ణాలలో జన్మించాననీ, ఏడు జన్మల క్రిందట తానొక కర్మఠుడైన బ్రాహ్మణుడనని చెప్పాడు. స్వామి పరీక్షించగా అతడు వేద వేదాంగాలలోని విషయాలను వల్లించి తన పూర్వజన్మజ్ఞానం యథార్థమని నిరూపించుకున్నాడు. "అయితే ఈ జన్మలో ఈ వర్ణంలో జన్మించావేమి?" అని స్వామి అడిగితే, తాను బ్రాహ్మణుడుగా ఉన్నప్పుడు ఇతర వర్ణస్థులను అసహ్యించుకుంటూ, వారందరూ నడచిన బాట మీద మంత్రజలం చల్లుకుని శుద్ధిచేసుకొని నడిచేవాడిననీ, అట్టి అనన్యచింతవలన తనకిప్పుడు ఈ జన్మ ప్రాప్తించిందనీ ఆ హరిజనుడు చెప్పాడు. వర్ణభేదం జన్మవలన వస్తుందని తలచి సంకుచితమైన అసహనాన్ని వహించిన వారికి జన్మాంతరంలో ఆధ్యాత్మిక

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:42 జనవరి - 2025 సంచిక:09

**పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"**

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | ధర్మసూక్ష్మాలు తెలియాలంటే! | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 06 |
| 03. | నూతన సంవత్సరానికి వినూత్న కానుక | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 08 |
| 04. | మాతృదేవి స్మృతులు | శ్రీ నరహరి | 10 |
| 05. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 13 |
| 06. | బుద్ధ ధ్యాన హృదయము | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 17 |
| 07. | భగవాన్ శ్రీ భరద్వాజ | శ్రీమతి శ్రీదేవి | 19 |
| 08. | శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు | శ్రీమతి శ్రీదేవి | 22 |
| 09. | ద్వారకామాయి అనుభవమండపము | శ్రీ రాజాలాల్ | 26 |
| 10. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీ రాఘవ శ్రీకాంత్ | 28 |


**చిరునామా**

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550

**www.saibharadwaja.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

**చందా వివరములు**

విడి ప్రతి : ₹ 10-00
సంవత్సర చందా : ₹100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

జ్ఞానానికే అవకాశంలేని కుటుంబాలలో జన్మించవలసి వుంటుందని స్వామి తన సేవకునికి తెలియబరచారు, శాస్త్రాల అర్థాన్ని మహనీయులయొద్ద తెలిసికొనక మనకు తోచిన తప్పుడు అర్థాలను అనుసరించి నడుచుకుంటే కలిగే అనర్థమే ఇది.

శ్రీ అవధూత వెంకయ్యస్వామి గూడా ఈ సత్యాన్ని తెలిపేవారు. ఆయన, "తప్పుచేస్తే మాదిగ యిండ్లలో పుడతారు. ఎన్నో జన్మలకు కూడా నా దగ్గరకు రాలేరు" అనేవారు. ఇక్కడ స్వామి 'మాదిగ' అన్నది పూర్వకర్మ దోషాలవలన ఈ జన్మలో కలిగే అజ్ఞానమనే ఆధ్యాత్మికమైన అంధత్వం. అందుకే వారు స్వామివంటి మహనీయులను గుర్తించి భక్తితో సేవించుకోలేరు.

నిజమైన వారి భావం స్పష్టమయ్యేలాగ ఆయన తరచు భక్తులతో, "మాలవాళ్ళు, మాదిగవాళ్లు నీలో లేకుండా చూచుకో అయ్యా" అనేవారు. ఒక్కొక్కప్పుడు అన్య వర్ణస్థులు తమ దర్శనానికి వచ్చినపుడు వారిని స్వామి బ్రాహ్మలనేవారు. ఉదా: జన్మతః మాల వంశంలో జన్మించిన వక్కమ్మను గురించి, "బ్రాహ్మణామె వచ్చిందయ్యా" అనేవారు. జన్మతః వైశ్యులైన పి. సుబ్బరామయ్యను ఈయన బ్రాహ్మణుడనేవారు. అలానే అల్లుభాస్కర్ అనే రెడ్డి వర్ణస్థుడు వారి దర్శనానికి వస్తుంటే "అడుగో ఒక బ్రాహ్మడొస్తున్నాడు" అన్నారు స్వామి. అంటే ఆయన దృష్టిలో మహాత్ములయందు పూజ్యభావము, మోక్షము లేక బ్రహ్మజ్ఞానంకోసం కోరిక గలవారే బ్రాహ్మలన్నమాట. సరిగా వజ్రసూచి ఉపనిషత్తులో బ్రాహ్మణత్వం ఇలానే నిర్వచించబడడం గమనార్హం.



అంతేగాక ధర్మశాస్త్ర గ్రంథాలలోగూడా జన్మతః బ్రాహ్మణుడైనవాడు గూడా బ్రాహ్మణత్వానికి తగిన రీతిన జీవించనట్లైతే అతడికి శూద్రత్వము, చండాలత్వము ప్రాప్తించి అతడు ధర్మబాహ్యుడౌతాడని చెప్పబడ్డది. అంటే ముముక్షువుకుండవలసిన గుణాలు కల్గి, వాటికి తగినరీతిన జీవించేవాడే బ్రాహ్మణుడనే అర్థంగాదా? అటువంటి వాడికి మాత్రమే బ్రాహ్మణ సంస్కారాలన్నీ సార్థకమౌతాయనిగదా శాస్త్రం?

అటువంటి గుణాలను దైవీసంపద, సత్వగుణము అని భగవద్గీత అభివర్ణించిందని మనం గుర్తించాలి. అట్టివారు చేసిన యజ్ఞ, దాన తపః కర్మలు మాత్రమే మోక్షమనే సాఫల్యాన్ని పొందుతాయని గూడా భగవద్గీతలోని శ్రద్ధాత్రయ విభాగయోగము స్పష్టంగా చెపుతుంది. దీనినే శ్రీ వెంకయ్య స్వామి, "సంపన్నత్వం, సాధారణత్వం గల్గి, సద్గురుసేవ చెయ్యి' అనేవారు.

సంపన్నత్వమంటే పైన చెప్పిన దైవీసంపద కల్గియుండడమన్నమాట. సాధారణత్వమంటే అట్టి గుణాలు తనలో వున్నాయని తానొక సాధువు, లేక ముముక్షువునని, తాను పవిత్రుడనని విర్రవీగి, సాటివారిని హీనులుగా తలచకుండడం అన్నమాట. ఈ సూత్రానికి స్వామి యొక్క జీవితవిధానమే ఒక ఆదర్శం. అందుకే అటువంటి మహనీయుల ఆచరణ అనే బోధనే ప్రమాణంగా స్వీకరించాలని ధర్మశాస్త్రాలు ఘోషించాయి.

బౌద్ధ, జైన, పార్శీ, క్రైస్తవ, ఇస్లాం మతాలు ఇందుకే 'పవిత్రమైన ఆధ్యాత్మిక జీవనం కలవారు, దానిని కలిగియుండనివారు' అని సమాజంలోని వ్యక్తులను వర్గీకరించడం గమనార్హం. ●


# పరిప్రశ్న

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

**ప్రశ్న :- మీరు స్త్రీలకు పతి తరువాతనే దైవమన్నారు. మీరన్నది సాధువర్తనులైన భర్తల విషయంలో నిజంగా వచ్చుగాని మానవత్వమే లేక వర్తించేవారి విషయంలో అదెలా సమంజసము ?**

**- ఒక సోదరి, విశాఖపట్నం**

**జవాబు :-** పురుషుల విషయంలో గూడ ఒకసారి గురువని తలచి ఆశ్రయించిన తర్వాత ఆ గురువును ఎట్టి పరిస్థితిలోనూ త్రిమూర్త్యాత్మకుడుగాను, పరబ్రహ్మగానూ విశ్వసించి సేవించాలని ఆర్షాచారము. ఉపనిషత్తులలో ఎందరో గురువులు ఎంతో అమానుషంగా శిష్యులను బాధపెట్టినట్లు, అయినా ధైర్యాన్ని ('ధీ' అంటే బుద్ధి) విడువక వారిని నిశ్చల విశ్వాసంతో సేవించి కృతార్థులైనవారెందరి గురించో వర్ణించబడ్డది. అలాగాక ఆ గురువును విడిచిన వాడి ముఖం చూడగూడదన్న విషయం 'శ్రీ గురుచరిత్ర'లో చూడవచ్చు. అలానే దీపకుడనే శిష్యుణ్ణి కాశీలో కుష్టువ్యాధితో బాధపడుతున్న గురువు ఎంతో క్రూరంగా చిత్రహింసలు పెట్టినా చలించక సేవించి కృతార్థుడైనట్లు చెప్పబడ్డది. అసలు జరిగేదేమంటే 'భాగవతం' లోని 'భిక్షుగీత' లో చెప్పినట్లు మనకెవరివల్ల ఏ కష్టం కల్గినా అది పూర్వ పాపకర్మ ఫలితమే. ఆ కష్ట మనుభవించవలసిన పాపకాల మొచ్చినపుడు ఏ విధంగానైనా అది తప్పదు. మంచి గురువు నాశ్రయించినా శిష్యుడి పాపకర్మ క్షయంగావడానికి మనను వారే అంతగానూ కష్టపెడతారు. వారు ఆ కర్మల ప్రాప్తికి నిమిత్త మాత్రులవుతారు. ఈ



వివరం "యోగి మిలారేపా" చరిత్రలో చూడవచ్చు. ఆ స్థితిలో శిష్యుడు అచంచల విశ్వాసంతో సేవ చేయాలి. అలాటి వారే కృతార్థులయ్యారు.

అలాగాక ప్రారబ్ధవశాన అజ్ఞుడైన కపట గురువు నాశ్రయించినా ఆ పాపకర్మఫలమే వారివలన కల్గే

బాధరూపంలో అనుభవమవుతుంది. అపుడు కృత్రిమంగాగాక సహజమూ, అమాయకమూ అయిన విశ్వాసంతో సేవించ గల్గిన వాడికి కొత్తదోషం సంక్రమించదుగానీ కర్మ క్షయమవుతుంది.

మీరు చెప్పినటువంటి దుష్టుడైన భర్త విషయమూ అంతే. అటు కపట గురువు దాపురించిన పురుషుడు గానీ, ఇటు దుష్టుడైన భర్త దాపురించిన స్త్రీ గానీ వారి పూర్వకర్మ ఫలంగానే అలాటివారి పాలిట పడతారు. సర్వకర్మ ఫలప్రదాతయైన భగవంతుడు సర్వగతుడు. వారి కర్మననుసరించివారికారూపంలోతారసిల్లివారికర్మఫలాన్ని వారికి అందచేస్తాడు. ఆ స్థితిలోనూ అచంచలమైన పాతివ్రత్యంతో (పతియే దైవమని) విశ్వసించి సేవించగల్గిన స్త్రీలు బ్రహ్మజ్ఞానాన్ని పొందారు. ఇందుకు చివటం అమ్మగారొక చక్కని ఉదాహరణ. ఇలా సేవించలేని వారు కనీసం నిర్లిప్తంగానైనా సహనంతో వుండాలి గాని ద్వేషాన్ని వహిస్తే ఆ కర్మబంధం వలన మరుజన్మలో ప్రతీకారానికై మరలా ఆ వ్యక్తితోనే ఋణంచేత బాధపడతారు. ఈ విధంగా 'చెన్నబసప్ప వీరభద్రప్ప' కథవలెనే అవుతుంది వారిగతి. అందుకే సాయి సూక్తులలో ఇతరులు మనను బాధిస్తే మనము ఎలా వుండాలో చెప్పినవాటిని చూస్తే తెలుస్తుంది. పురాణాలలోని దుష్టులైన భర్తలను సేవించిన పతివ్రతలు కూడ ఉన్నతికొచ్చిన ఉపాఖ్యానాలీ విషయాన్నే వివరిస్తాయి. భగవద్గీత యుద్ధం వంటిది గూడ రాగద్వేషాది ద్వంద్వరహితంగా, స్వధర్మంగా చేయాలని చెబుతుంది.

ఈ విషయంలో ఎన్నో లేఖల్లోనైనా వివరించలేనంతటి ఇతర అంశాలెన్నో వున్నాయి. ఎప్పుడైనా అవకాశమొస్తే ముఖతః వివరంగా చర్చించవలసిందే. భార్య ఎంత గయ్యాళియైనా శ్రీ రామానుజాచార్యులెంత ఓర్పుతో వున్నారో చూడండి. ఆమెకై ఆమె వెళ్ళిపోయినపుడు అది భగవత్సందేశంగా తలచి ఆయన సన్యసించారు.

ఇంకొంత వివరాన్ని 'శ్రీ సాయినాథ ప్రబోధామృతము' లోను, 'శ్రీ గురుచరిత్ర' లోని అనుబంధంలోను చూడండి. అలా విశ్వాన్ని భగవంతుడుగా దర్శించగల్గాడు – భాగవతం (ఉద్ధవగీత)లో వర్ణించబడిన అవధూత. అలా దర్శించలేని మనకది మాయా స్వరూపంగానే అనుభవమై మనలను సంసారంలో బంధిస్తున్నది. కష్టాలలోను, సుఖాలలోను సములై సర్వత్రా భగవంతుణ్ణి చూడగల్గాలనే గీతాది గ్రంథాలన్నీ చెప్పేది. ●

---

## *ప్రశ్న :- పితృకర్మలాచరించకుంటే పితృదేవతలు శపిస్తారంటారు. జన్మ పరంపరలలో జీవి పరిభ్రమించేటప్పుడు యిదెలా సాధ్యం ?*

***– శ్రీమతి కమలారామచందర్, హైదరాబాద్***

**జవాబు :-** పితృదేవతలంటే చనిపోయిన మన పెద్దలని మాత్రమే గాదు. సృష్టిలోని నానాత్వంలో లోకాలు అంతర్భాగమే. అపుడు లోకాధిపతులు గూడ యిప్పటి జనులెంత వాస్తవమైన వారో అంతే వాస్తవం. పితృలోకానికి అధిదేవతలు పితృదేవతలు. సృష్టిమొత్తం ప్రతిజీవి, దేవత తక్కిన జీవులన్నింటికీ ఏదో ఒక రీతిన ఉపయోగపడతారని, సహాకరిస్తారనీ 'యజ్ఞము' అనే భావం సూచిస్తుంది. అపుడు మన పూర్వీకుల ఆత్మలూ మరణానంతరం చేరే లోకాలలో ఒకటి పితృలోకం. అక్కడ మన కర్మఫలాలు కొన్ని అనుభవమవుతాయి. అందుకు సహకరించే దేవతలకు మనం ఋణపడియుంటాము. వారికి కృతజ్ఞతాపూర్వకంగా మనం చేసే పూజలే పితృకర్మలు. సృష్టిలోని వివిధ ప్రకృతిశక్తుల రూపులైన దేవతలపట్ల మనం కృతజ్ఞులంగా వుండడం ధర్మమే. లేనిది కృతఘ్నతే. దానికి ఫలం వుంటుంది. దానినే శపించడమంటారు. నిప్పుతో అలక్ష్యంగా వ్యవహరిస్తే చేయి కాలినట్లు. అయితే భావమెరిగి నిజమైన ప్రీతితో చేసిన ఆరాధనే అంగీకారమౌతుంది. మనమీ రోజులలో చేసేవి పితృకర్మలే కావు. వాటి ప్రయోజన మొక్కటే. ఏనాటికైనా మనకు వాటి విషయమై జిజ్ఞాస కల్గేందుకుపకరిస్తాయి. మన విధులను నిర్వర్తించాలన్న సత్యాన్ని ఏదో ఒక స్థాయిలో అవి మేల్కొల్పుతాయి.

(జనవరి 2017 సాయిబాబా మాసపత్రిక నుండి)

# నూతన సంవత్సరానికి వినూత్న కానుక

**పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ**

నూతన ఆంగ్ల సంవత్సరం ప్రవేశించబోతున్నది. ఆ సంవత్సరంలో మన జీవితం ఎలా వుండబోతున్నది? ఎలా వుండాలి అనుకుంటున్నాము? అని ప్రతివారికీ సహజంగానే అనిపిస్తుంది. అయితే మనం తలచినట్లుగానే, మనం వూహించినట్లుగానే వుంటుందా? అని అనుమానము.

ప్రతి మానవునికీ కొన్ని ఆశలు, ఆశయాలు వుండటం సహజమే. ఏవేవో పొందాలనే ఆశ, వేటినో సాధించాలనే ఆశయాలు వీటిని సాధించడానికి మనిషి నిరంతరం ప్రయత్నిస్తూవుంటాడు. ఆశ అనేది స్వార్థపూరితమైనది కావచ్చు, నిస్వార్థపూరితమైనది కావచ్చు.

స్వార్థపూరితమైన ఆశ కూడా కొంతవరకూ సమంజసమైనదే – కానీ అది అత్యాశగానూ, దురాశగానూ పరివర్తన చెందకూడదు. ఈ అత్యాశ, దురాశ వల్లనే ప్రపంచంలో ఎన్నో అధర్మపూరితమైన కార్యక్రమాలు విజృంభించి అంతులేని అశాంతిని కలుగజేస్తున్నాయి. పోనీ ఈ అత్యాశ, దురాశ కలిగిన వారి చర్యలవల్ల వారికైనా శాంతి వుంటుందా అని అనుకుంటే అది పొరపాటే! వారికి కూడ శాంతి వుండకపోగా, అశాంతితో నిరంతరం కుతకుతలాడిపోతుంటారు. దీనికి ఉదాహరణగా దుర్యోధనాదులను చెప్పుకోవచ్చు. అట్టి దురాశకు ఫలితం సర్వనాశనానికి దారితీస్తుందని మహాభారతం చెప్పే గుణపాఠం.

దీనికంతటికీ కారణం ఏమిటి? మనిషికున్న సహజమైన ఆశ – అత్యాశగానూ, దురాశగాను, పరిణమించడమే! అయితే దీనిని అధిగమించటం ఎలా? ఇందుకు పరిష్కారం ధర్మబద్ధంగా జీవించడమే అని పెద్దలు చెప్పారు అయితే ధర్మబద్ధమైన జీవితం అంటే ఏమిటి? గడపడం ఎలా? అన్నది ప్రశ్న. ప్రతివారికి తాము నడుస్తున్నది ధర్మబద్ధంగానేనని అనిపిస్తుంది. నిజంగా ఏది ధర్మమో, ఏది కాదో తెలుసుకోవడం ఎలా?

ఇందుకు సమాధానం ధర్మబద్ధమైన జీవితాలను గడిపిన వారి యొక్క చర్యలు, బోధలూ తెలుసుకుంటే గాని అర్థంకాదు. అలాంటి వారి జీవితాలను ఆదర్శంగా తీసుకొని వారి అమృతవాక్కులను అనుసరిస్తూ పోతేగాని మనకు కూడా ధర్మపరమైన జీవితం సాధ్యపడదు.

ఇందుకు ప్రత్యక్షసాక్షులు పూజ్యశ్రీ మాస్టరు గారే! ఆయన పరిపూర్ణమైన, ధర్మబద్ధమైన జీవితాన్ని గడపారు. ఆయన ప్రతిచర్య, మాట కూడా ధర్మబద్ధమైనదే. ఆయనలో కాగడా పెట్టి వెతికినా అధర్మపరమైనదేదీ కనిపించదు. ఉదాహరణకు ఆయన ధర్మపరమైన ఉద్యోగ్యాన్ని ఎంచుకున్నారు. తన ఉద్యోగ ధర్మాన్ని తు. చ. తప్పక పాటించారు. తమ ధనాన్ని ధర్మబద్ధంగానే వినియోగించారు. ఆయన చేతిలో డబ్బులు ఎప్పుడూ నిలువ వుండేవికావు. ఇతరుల అవసరాలను గుర్తించి తమ ధనాన్ని ఖర్చుపెట్టేవారు. "ఇతరుల నేటి అవసరాలు గుర్తించక మనకు రేపటి కోసం అట్టిపెట్టుకోవడం ధర్మం కాదు" అని ఆయన చెప్పేవారు.

ఒకసారి శిరిడిలో ఒక వ్యక్తి వచ్చి పూజ్యశ్రీ మాస్టరుగారితో తన కష్టాలు చెప్పుకున్నాడు. అతనితో పూజ్యశ్రీ మాస్టరుగారికి అంతకుముందు పరిచయమేమీ లేదు. కొత్తవాడే అయినప్పటికీ పూజ్యశ్రీ మాస్టరుగారు వెనకా ముందూ ఏమీ ఆలోచించకుండా తన వద్దనున్న పైకం మొత్తం అతనికి

ఇచ్చేశారు. "ఎందుకిలా చేశారు? రేపటి ఖర్చులకు తిరుగు ప్రయాణానికి కూడా డబ్బులు లేవు కదా, ఎలా? అంటే ఆయన ఇలా సమాధానమిచ్చారు: "అతనికి డబ్బుల అవసరం ఎంతగానో వుంది. నాదగ్గర డబ్బుంది. అందుకే ఇచ్చాను. రేపటి సంగతి ఏదో విధంగా నేను ప్రయత్నం చేయవచ్చు. ఇక్కడ నాకు అప్పు అయినా పుడుతుంది. ఆ అప్పు తీర్చుకోవడానికి నాకు ఉద్యోగం వుంది. ఒకవేళ నాకు ఇక్కడ అప్పు దొరకకపోతే నా సంగతి బాబా చూసుకుంటారు అనే ధైర్యం నాకున్నది. ఒక వేళ బాబా అవసరాలు తీర్చకపోయినా నాకేమీ చింతలేదు. ఆ రోజు ఆయన నన్ను అలా వుండమన్నారు అనుకుంటాను".

ఇలాగే ఆయన అన్ని విషయాలలోనూ అత్యుత్తమ ధర్మాన్ని పాటించారు. అందుకే ఆయన మనకు ఆరాధ్యదైవమైనారు. ఆ కారణంగా ఆయన చర్యలు, సూక్తులు మనకు ఆచరణయోగ్యమైనవి. ఆయన తరచుగా ఇలా చెబుతుండేవారు.

"మనకు ఈ విశ్వంలో ఏది సరైన విధంగా నడవాలన్నా దానిలో ధర్మసూత్రం ఇమిడి వుంటుంది. ఆ ధర్మసూత్రం ప్రకారం విశ్వమంతా నడుస్తుంది. దానిలో అస్తవ్యస్తమేర్పడినప్పుడు ప్రమాదాలు సంభవిస్తాయి. ఈ సూత్రం ప్రకారం మానవజీవితాలు కూడా నడుస్తున్నాయి. ధర్మబద్ధమైన జీవితాలను గడుపుతున్నప్పుడు అంతా ప్రశాంతంగానే గడుస్తుంది. సుఖశాంతులు వెల్లివిరుస్తాయి. అందులో ఏమాత్రం తేడా ఏర్పడినా మానవుల జీవితంలోనూ, సమాజంలోనూ క్లిష్టపరిస్థితులు నెలకొంటాయి. నేటి సమాజం ఇలా వుండటానికి కారణం, అంటే మనం ఇలా క్లిష్టపరిస్థితులను ఎదుర్కోవలసి రావడానికి కారణం ఇదే. అందుకే ప్రతివాడూ ధర్మమేమిటో తెలుసుకొని, అలా ప్రవర్తించడానికి ప్రయత్నించాలి. అది లుప్తమైతే ఇంకా ఇంకా నివారించడానికి కూడా వీలుపడని పరిస్థితులు ఏర్పడతాయి. అప్పుడు ప్రళయం తప్పదు. అట్టి పరిస్థితి వచ్చేలోపే రాకుండా మనం తగు జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే ఇంకా ఇంకా అశాంతిలో కూరుకుపోవడం తథ్యం. అందుకని ధర్మబద్ధమైన జీవితాన్ని గడపడానికి, అధర్మాన్ని ఎదుర్కోవడానికి ప్రతివారు ప్రతి క్షణము ప్రయత్నించాలి. అందుకు ధర్మప్రబోధం నిరంతరం కొనసాగాలి. ప్రపంచంలోని ప్రతి వ్యవస్థలోనూ ధర్మప్రబోధమైన కార్యక్రమాలు నిర్వహించాలి. అప్పుడే ప్రజలలో ధర్మంపట్ల ఆసక్తి, అధర్మం పట్ల విరక్తి కలుగుతాయి".

మాస్టరుగారు చెప్పిన ఈ మాటలు ఎంత సత్యమైనవో ఈనాడు మనంకింకా ఇంకా అనుభవగతమౌతున్నవి. అంటే ఇప్పటికైనా మనం మేలుకోకపోతే. ఇంకా ఎంతటి అనర్థాలను ఎదుర్కోవలసి వస్తుందో చెప్పనవసరం లేదు. అంటే మన ఆలోచనలు, ప్రవర్తన ధర్మబద్ధమైనవిగా వుండాలి. మన ఆశలు, ఆశయాలు మనకు, ఇతరులకు శ్రేయస్సు చేకూర్చేవిగా వుండాలి. అందుకు పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినవాటిని బాగా మననం చేసి, ఆచరించడానికి ప్రయత్నించాలి. పూజ్యశ్రీ మాస్టరుగారు యిలా చెప్పారు: "బాబా సూక్తులు ఆచరించడానికి ప్రయత్నిస్తూవుంటే మన ప్రవర్తన అంతకంతకూ ధర్మపరమైనదిగా ఉంటుంది." అయితే బాబాసూక్తులను అర్థం చేసుకోవాలంటే పూజ్యశ్రీ మాస్టరుగారి వివరణలేనిదే సాధ్యపడదు. కనుక బాబాసూక్తులకు వివరణనిచ్చిన పూజ్యశ్రీ మాస్టరుగారు రచించిన శ్రీ సాయినాథ ప్రబోధామృతము చదివితీరాలి. ఆ గ్రంథాన్ని పదేపదే చదువుతూ పూజ్యశ్రీ మాస్టరుగారు యిచ్చిన వివరణ గురించి చింతన చేస్తూ దానిని ఆచరణలో పెట్టుకోవడానికి ప్రయత్నిస్తుంటే గాని మనకు ధర్మాచరణ సాధ్యపడదు.

అయితే సాధారణంగా మనం ఈ విధమైన ప్రయత్నం అందరూ చేయాలని, సహకరించాలని, అలా చేయించేటట్లుగా ఎవరో ఒకరు పూనుకోవాలనీ అనుకుంటాము. కాని అలా ఆలోచించడం వల్ల ఏమీ ప్రయోజనం వుండదు. ఎవరికి వారు మనమే ప్రయత్నించి చూద్దాము అని అనుకోవాలి. ముందు మనం మారితే మనకు శ్రేయస్సు కలుగుతుంది.

దాని వల్ల ఇతరులకు కూడా శ్రేయస్సు కలుగవచ్చు. తప్పక కలుగుతుంది కూడా. మనలను చూసి ఇతురులు కూడా ఆచరించడానికి ప్రయత్నించవచ్చు. అప్పుడు సమాజం సరైన విధంగా మారడానికి అవకాశం ఉంటుంది.

అందుకని పూజ్యశ్రీ మాస్టరుగారు మననుంచి ఆశించిన విధంగా సాయిబాబా సూక్తులను ఆచరించడానికి ఎవరికి వారుగా ప్రయత్నిద్దాం. అలా చేసినట్లయితే మనలోని స్వార్థపూరితమైన ఆశలు, ఆశయాలు తొలిగించుకోడానికి ప్రయత్నించ గలుగుతాము. ధర్మపరమైన ప్రవర్తన అలవరుచుకోగలుగుతాము.

ఈ నూతన ఆంగ్లసంవత్సరంలో ఇదే మనము పూజ్యశ్రీ మాస్టరుగారికి సమర్పించుకునే వినూత్నమైన కానుక. ●

# మాతృదేవి స్మృతులు

*స్వర్గీయ శ్రీ నరహరి, నాగోలు*

పూజ్యశ్రీ అలివేలు మంగమ్మతల్లి లీలావైభవాన్ని హైదరాబాదు, నాగోలుకు చెందిన శ్రీ నరహరిగారు ఈ విధంగా తెలియచేశారు.

మేము 2008లో, మౌలాలి లో, శ్రీ టీ.వీ.రావుగారి ఇంట్లో అద్దెకు దిగాము. వారి ద్వారా పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగారి గురించి తెలిసింది. మాది మధ్వ సాంప్రదాయం. శ్రీరాఘవేంద్రస్వామిని ఆరాధించేవారము.

అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు నాగోలులో వుండేవారు. వారి సత్సంగాలు వినడం వల్ల, పూజ్యశ్రీ మాస్టరుగారి రచనలు చదవడం వల్ల ఆధ్యాత్మికత కొత్త కోణంలో కనిపించింది. అతి గొప్ప జ్ఞానాన్ని అందరికీ సులభతరమైన మార్గంలో పూజ్యశ్రీ మాస్టరుగారు చాలా చక్కగా వివరించి అందించారనిపించింది.

శ్రీరాఘవేంద్రస్వామి భక్తులము కొంతమంది కలిసి స్వామివారిపై పాటలు పాడి ఒక ఆడియో కేసెట్ తయారుచేశాము. ఒకరోజు నేనొక్కడినే ఆ కేసెట్ తీసుకుని నాగోలు పూజ్యశ్రీ అమ్మగారి చిరునామా వెతుక్కుంటూ వెళ్ళాను. కొంచెం కష్టపడే నాగోలు నిలయానికి చేరుకున్నాను. పూజ్యశ్రీ అమ్మగారికి ఆ కేసెట్ ఇచ్చి, "అమ్మా మాకు పిల్లలు లేరు. ఆ విషయంలో మీ ఆశీస్సులు కావాలి" అన్నాను. పూజ్యశ్రీ అమ్మగారు ఏమీ మాట్లాడలేదు! మౌనంగా చేతిలో ఊది వేశారు. నేను నమస్కారం చేసుకుని వచ్చేశాను. తరువాత ఆ విషయం గురించి ఆలోచించలేదు.

2010 లో టీ.వీ.రావుగారి కుటుంబం నాగోలుకు మకాం మార్చారు. నేను, నా శ్రీమతి పద్మజ మౌలాలినుంచి సత్సంగాలకు వచ్చి వెళుతూండేవాళ్ళము. మా అమ్మ మాతో వుండాలని మా దగ్గరకు వస్తానన్నది. మేము మేడ మీద భాగంలో వుండేవారము. అమ్మకి మోకాళ్ళనొప్పుల కారణంగా క్రింద వుండే ఇల్లు చూడమని చెప్పింది. అప్పుడు వేరే చోటకి మారడం ఎందుకని నాగోలుకే మకాం మార్చాము. ఆ విధంగా పూజ్యశ్రీ అమ్మగారు మమ్మల్ని కూడా నాగోలు వాసులను చేసి వారి సన్నిధిలో వుండే భాగ్యాన్ని ప్రసాదించారు. గురుకుటుంబం సన్నిధిలో సత్సంగాలు, దీక్షలు, పండుగలు, యాత్రలు, వేడుకలు... అంతులేని ఆనందోత్సాహాలతో జరిగేవి. వీటన్నింటిలో ఆధ్యాత్మికత మేళవించి వుండేది. ఇంతకుముందెన్నడూ చూడని కొత్త జీవితాన్ని రుచి చూపించారు. ఆధ్యాత్మిక మార్గం అంటే దేనినీ వదులుకోనక్కరలేదని, ప్రతీదాన్నీ ఆధ్యాత్మికంగా చూడవచ్చనీ అర్థమైంది.

నేను నిమ్స్(NIMS) ఆసుపత్రిలో స్టెరలైజేషన్ విభాగంలో పనిచేస్తాను. నా ఉద్యోగవిధులు పూర్తయ్యాక మిగిలిన సమయంలోను, సెలవు దినాలలోనూ కొన్ని సేవలు చేసుకునేవాడిని. మిద్దెమీద పంటలు పండించి

పూజ్యశ్రీ అమ్మగారికి సమర్పించుకునేవారము. కళ్యాణోత్సవాలలో సేవలు చేసుకునేవారము.

నేను ప్రతి పౌర్ణిమకు తంతుకసేవకు గాణగాపురం వెళ్ళేవాడిని. ఒకసారి పూజ్యశ్రీ అమ్మగారు, "తంతుకసేవ చేసుకునే అవకాశాన్ని శ్రీగురుడు మీకు కల్పించినందుకు కృతజ్ఞతగా మీ దంపతులిద్దరూ ప్రతి సంవత్సరం గాణగాపురంలో మూడు రోజులు నిద్ర చేయండి. సంవత్సరానికి ఒకసారి తప్పకుండా నా దర్శనానికి రండి!" అని చెప్పారు! పూజ్యశ్రీ అమ్మగారు మామూలుగా ఎవరినీ తమను దర్శించుకోమని చెప్పరు. బాబాను, పుజ్యశ్రీ మాస్టరుగారినీ దర్శించమని చెబుతారు. తమ నిజస్థితిని వెల్లడించిన అతి అరుదైన సందర్భం అది!

పూజ్యశ్రీ అమ్మగారు 2017లో జగ్గయ్యపేట వెళ్లారు. అప్పుడు నేను, నా శ్రీమతి పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి జగ్గయ్యపేటకు వెళ్ళాము. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు, "మీరు రాఘవేంద్ర స్వామి ఆరాధనకు మూడు రోజులూ ఒకే మఠానికి వెళ్తారా? మూడు చోట్లకి వెళతారా?" అని అడిగారు!! మేము, "ఒకే చోటికి వెళతాము అమ్మగారూ!" అని చెప్పాము. అప్పుడు, "మూడు చోట్లకి వెళ్ళండి!" అని చెప్పారు. అప్పటినుంచి హైదరాబాదులో వుండే మూడు మఠాలకు వెళ్ళడం మొదలుపెట్టాము.

శ్రీ రాఘవేంద్రస్వామి ఆరాధన మూడు రోజులు జరుగుతుంది. సిద్ధిపొందిన ముందురోజు పూర్వారాధన, సిద్ధిపొందిన రోజు మధ్యారాధన, తరువాత రోజు ఉత్తరారాధన అంటారు. మేము మూడు రోజులూ ఒకే మఠానికి వెళ్ళేవారము. పూజ్యశ్రీ అమ్మగారికి ఈ విషయాలు మేమెప్పుడూ చెప్పలేదు. వారే అకస్మాత్తుగా అలా అడిగారు! వారికి తెలియనిది ఏమున్నది? ఇలా ఎన్నో పొరపాట్లను సరిదిద్దేవారు.

నాకు ఉద్యోగంలో చాలా ఇబ్బందులు ఎదురయ్యేవి. అన్నీ పూజ్యశ్రీ అమ్మగారి దయవల్ల సమసిపోయేవి. ఒకసారి లాబ్ కి అవసరమైన స్టాక్ తెప్పించే విషయంలో మార్కెటింగ్ వారికి, మా అడ్మినిస్ట్రేషన్ వారికి తేడాలు వచ్చి, మధ్యలో



వున్న నామీద ఆ ప్రభావం పడి, నేను అనవసరంగా 80,000 రూపాయలు కట్టవలసిన పరిస్థితి వచ్చింది. కొన్ని రోజులు వాదోపవాదాలు జరిగాయి. మధ్యవర్తిగా వుండడం వల్ల నాకు డబ్బులు కట్టవలసిన పరిస్థితి తప్పేటట్టు లేదు. అప్పటికి పూజ్యశ్రీ అమ్మగారు సశరీరంగానే వున్నారు. కానీ నేను ఈ విషయం పూజ్యశ్రీ అమ్మగారికి చెప్పలేదు. 'ఇలాంటి గొడవలు చాలా జరుగుతూనే వుంటాయి... ఎన్నని చెప్పాల'ని నా ఉద్దేశం.

ఒకరోజు మాత్రం మా ఇంట్లో వున్న పూజ్యశ్రీ అమ్మగారి చిత్రపటానికి చెప్పుకున్నాను. ఆశ్చర్యం!! చిత్రంగా ఆ గొడవ సర్దుకుని నేను డబ్బులు కట్టవలసిన పరిస్థితినుంచి బయటపడ్డాను. పూజ్యశ్రీ అమ్మగారికీ, వారి చిత్రపటానికి భేదం లేదు!! సశరీరంగా వున్నప్పుడే వారు శరీరపరిమితులు కారని నాకు ప్రత్యక్ష అనుభవాన్ని ప్రసాదించారు.

నేను వరుసగా మూడు నెలల్లో కొన్ని రోజులు ఉద్యోగానికి సెలవు పెట్టవలసివచ్చింది. ఆ సెలవులన్నీ కలిపి నమోదు చేయమని పై అధికారులను అడిగాను. నాకు చాలా సెలవులు వున్నాయి. కానీ పై అధికారులు, "నీ ఖాతాలో సెలవులు లేవు



కనుక నీ అర్జీని ఆమోదించలేము. దానివల్ల ఈ నెల జీతం కూడా రాదు!" అని చెప్పారు. మా ఆసుపత్రి ఆవరణలో అంతస్థులన్నీ ఎక్కి, దిగి, అందరినీ కలుసుకుని మొరపెట్టుకున్నాను. ప్రతివారూ కుదరదనే చెప్పారు. చివరికి నేను పనిచేసే గదిలో పటం రూపంలోవున్న పూజ్యశ్రీ అమ్మగారికి నా సమస్య చెప్పుకున్నాను. చివరిసారిగా మళ్ళీ దానికి సంబంధించిన విభాగానికి వెళ్లి అడిగితే, అక్కడ వున్న అతను సిస్టం తీసి చూశాడు. ఆశ్చర్యం!! నా సెలవు ఆమోదింపబడి వుంది! అతను కూడా ఆశ్చర్యపోయాడు. ఆ అద్భుత లీలకు పులకరిస్తూ పూజ్యశ్రీ అమ్మగారికి మనస్సులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాను.

నాకు బి.పి., షుగరు, కిడ్నీ సమస్య... అన్నీ వున్నాయి. 2016లో నాకు విపరీతమైన అనారోగ్య పరిస్థితులు ఎదురైతే పరీక్షలు చేసి CKD అని తేల్చారు. అంటే 'క్రానిక్ కిడ్నీ డిసీజ్' అని అర్థం. నేను మందులు వాడుతూ, వేరే వైద్యవిధానాలు ప్రయోగాలు చేస్తూ డయాలసిస్ వరకూ రాకూడదని చాలా ప్రయత్నాలు చేశాను. అలా 2020 వరకూ గడిపాను. ఒకరోజు తీవ్రమైన అనారోగ్య సమస్య వచ్చి వైద్యులు, "కిడ్నీ మార్పిడి అయినా జరగాలి, లేదా డయాలసిస్ అయినా చేయించుకోవాలి. చాలా ప్రమాదకర పరిస్థితిలో మీ ఆరోగ్యం వుంది" అని చెప్పారు. ఇక ఆలస్యం చేస్తే గుండెజబ్బు రావచ్చని కూడా చెప్పారు. నేను పూజ్యశ్రీ అమ్మగారితో ఈ విషయం విన్నవించుకున్నాను. పూజ్యశ్రీ అమ్మగారు, "శ్రీ సాయిలీలామృతం ఒక పారాయణ చేసి, రెండు చీటీలు తీసుకుని ఒకటి డయాలసిస్, ఇంకొకటి కిడ్నీ మార్పిడి అని వ్రాసి బాబా ముందు పెట్టి, ఎవరైనా చిన్నపిల్లలతో తీయించి, అందులో ఏది వస్తే అది బాబా ఆజ్ఞగా స్వీకరించండి!" అని చెప్పారు. అదేవిధంగా చేస్తే 'డయాలసిస్' అన్న చీటీ వచ్చింది. నేను శిరసావహించాను. అలా 4 సంవత్సరాలు గడిచాయి. క్రిందటి సంవత్సరం ఆరోగ్యపరంగా చాలా ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొన్నాను. రెండు రోజులు కోమాలో వుండిపోయాను. వెంటిలేటరుపై వుండి కూడా బయటికి వచ్చాను. ఒకసారి ఇంట్లోనే రాత్రి సమయంలో మూతి పక్కకి వెళ్ళిపోయి పక్షవాతం వచ్చే పరిస్థితి వచ్చింది. మళ్లీ కొద్దిసేపట్లోనే మామూలుగా వచ్చేసింది. ఇలా ఎన్నోసార్లు నాకు ప్రాణభిక్ష పెట్టారు పూజ్యశ్రీ అమ్మగారు.

ఇంకొక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, కరోనా సమయంలో మా ఆసుపత్రి సిబ్బందికి 250 మంది దాకా కరోనా వచ్చింది. మా ఆసుపత్రిలో ఆ కేసులు కూడా తీసుకునేవారు. ఇన్ని ఆరోగ్య సమస్యలున్నా, నాకు మాత్రం కరోనా రాలేదు! ఏ ప్రారబ్ధాన్ని ఎంత మోతాదులో అనుభవింపజేయలో వారికే ఎరుక!

నాకు పూజ్యశ్రీ అమ్మగారు వున్నారన్న భరోసానే నా జీవితాన్ని ముందుకి నడిపిస్తోంది. ఒక సంవత్సరం డిసెంబర్ 31 రాత్రి జరిగే సత్సంగానికి మేము హాజరు కాలేదు. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు లోపల వారి గదిలోనే వున్నారు. వారికి మేము రాలేదన్న సంగతి తెలిసే అవకాశమే లేదు. మరునాడు సేవకులతో, "నిన్న నరహరిగారి కుటుంబం రాలేదనుకుంటానే! ఎలా వున్నారో కనుక్కోండి!" అని చెప్పి మాకు ఆశీస్సులు ఇచ్చారు!

ఇంతటి కరుణామూర్తుల చల్లని నీడలో ఎంతటి ప్రారబ్ధాన్నైనా హాయిగా అనుభవించవచ్చు! జన్మజన్మలకూ వారు మాకు తోడుగా వుండి, మమ్మల్ని సన్మార్గంలో నడిపించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ శతసహస్రవందనాలు సమర్పించుకుంటున్నాను.

జై సాయి మాస్టర్!

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

**శ్రీమతి అడిదం వేదవతి**

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

## 14వ ప్రసంగము

### అనధికారికి ఉపదేశించినట్లయితే బ్రహ్మవిద్య విలపిస్తుంది

ఒకసారి ఒక బ్రహ్మజ్ఞుడు అనధికారికి బ్రహ్మవిద్యను ఉపదేశించాడు. అప్పుడు బ్రహ్మవిద్య ఎంతో బాధతో కళ్ళ వెంట నీరు కారుస్తూ బ్రహ్మజ్ఞులు వున్నచోటికి వెళ్లి గద్గద స్వరంతో యిలా అన్నది: “ఓ బ్రహ్మజ్ఞులారా! నన్ను రక్షించండి. సరైన అర్హత, పాత్రత కలిగిన అధికారికి మాత్రమే నన్ను సమర్పించండి. పాత్రాపాత్ర విచక్షణ (అర్హత కలవాడా, కాదా అనే విచక్షణ) లేకుండా నన్ను ఎవరికిబడితే వాడికి అర్పించకూడదు. గుణహీనులకు (సద్గుణాలు లేనివారికి) నన్ను యిస్తున్నారేమో కొంచెం ఆలోచించండి. ఎందుకంటే, వారు నా పేరుతో ఎన్నో అనర్థాలు చేస్తారు. నా పేరుతో ప్రపంచాన్నే కొల్లగొడతారు. శ్రద్ధ కలిగిన భక్తులను బాధిస్తారు. అసత్య మూలకమైన కీర్తిని (అబద్ధపు కీర్తిని) సంపాదించడానికి వారు నా పేరిట అనేక రకాలైన ఆడంబరాలు చేస్తారు. నాపట్ల శ్రద్ధ గాని, పరిపూర్ణమైన జ్ఞానం గాని లేకుండావుండే అధములకు బ్రహ్మవిద్య అనబడే వివిధరూపధారిణి (అనేక రూపాలు ధరించేది) పరమానందాన్ని ప్రసాదించే నన్ను అర్పించడం అంటే అపాత్రునికి (అర్హత లేని వాడికి, తగని వాడికి) సౌందర్యవతిని కన్యాదానం చేయడమే. అటువంటి పనిని చేయవద్దు.”

“ఓ బ్రహ్మజ్ఞులారా! నన్ను అర్హత లేనివాడికి యిచ్చినట్లయితే నాకు, మీకు శ్రేయస్సు కాదు. గుణవంతుడిని నిందించేవారు కుటిలమైన (సంకుచితమైన) స్వభావం కలవారు, ఇంద్రియనిగ్రహం లేనివారు, నమ్రత లేనివారు, గురువు యందు శ్రద్ధ లేనివారు, అటువంటి అధములకు నన్ను అర్పించకండి. శమ దమాది గుణాలు కలవారికే నన్ను ఉపదేశించండి. మీరు నన్ను రహస్యంగా వుంచండి.

అర్హత కలవాడికి నన్ను అర్పించండి. నేను మీకు కామధేనువులాగా, మీ మనసులోని కోరికలన్నింటినీ తీరుస్తాను. మీరు గుణహీనుడికి నన్ను ఉపదేశించినట్లయితే ఫలాలే ఇవ్వలేని లత లాగ వుంటాను. వంధ్యత్వాన్ని (గొడ్రాలు) పొంది మీకు గాని వారికి గాని ఎటువంటి ఫలాల్ని

ప్రసాదించను."

*శ్లో॥ వేదాంతే పరమం గుహ్యం*
*పురాకల్పే ప్రచోదితమ్।*
*నాఽప్రశాన్తాయ దాతవ్యం*
*నా పుత్రాయ శిష్యాయ వా పునః ॥*

— అని శ్వేతాశ్వతరోపనిషత్తు చెబుతోంది.

భావం : ఉపనిషత్తులలో పరమ పురుషార్థముగా చెప్పబడిన అతి రహస్యము, కల్పము మొదట్లో బ్రహ్మ ఉపదేశించిన బ్రహ్మవిద్యను ప్రశాంత చిత్తములేని శిష్యుడికి గాని, కుమారుడికి గాని ఉపదేశించకూడదు.

ప్రశాంతచిత్తుడు : దర్పము మొ॥న దోషాలు శమించినవాడు శాంత చిత్తుడు. దర్పాదులు అంటే (దర్పము మొ॥నవంటే)-- దర్పము (గర్వము), ఇచ్ఛ (కోరిక), ద్వేషము, సుఖము, దుఃఖము, కామము, క్రోధము, లోభము, మోహము, హర్షము, అసూయ, అహంకారము, నింద, గర్వము, మత్సరము (ఈర్ష్య), దంభము (కపటత్వము) మొ॥నవి.

వేరేవాడిని తిరస్కరించడం మొ॥న వాటి పట్ల దృఢమైన భావం కలిగి వుండటం **'దర్పము'**. ధనము మొ॥న వాటి పట్ల అభిలాష **'ఇచ్ఛ'**. శత్రువులు మొ॥న వారిని చంపాలనే భావము **'ద్వేషము'**. అనుకూలాలైన ధనము మొ॥నవి లభించకపోవడంచేత కలిగే బుద్ధి యొక్క అస్వస్థత (అనారోగ్యము) **'దుఃఖము'**. స్త్రీ మొ॥న వాటియందు అభిలాష **'కామము'**. మనము అభిలషించిన (కోరుకున్న) పదార్థము విషయములో కలిగిన దెబ్బ (విఘాతము) వలన బుద్ధికి కలిగే క్షోభయే **'క్రోధము'**. లభించిన ధనాన్ని ఇచ్చే (దూరం చేసుకునే) ఉద్దేశము లేకపోవడమే **'లోభము'**. దుఃఖము కలిగించే పదార్థాల పట్ల అవి సుఖము కలుగజేస్తాయనే భావమే **'మోహము'**. చిత్తములో వున్న సుఖాన్ని అభివ్యక్తం చేసే (వ్యక్తం చేసే) ముఖం వికసించడం మొ॥న వాటికి కారణభూతమైన చిత్త వృత్తే **'హర్షము'**. ఇతరుల గుణాలలో దోషాలను ఆపాదించే (ఆరోపించే) బుద్ధి **'అసూయ'**. శరీరము, ఇంద్రియాల పట్ల నేను, నావి అనే ఆత్మతత్వ భ్రమే **'అహంకారము'**. ఇతరులను దూషించడం **'నింద'**. ఇతరుల కంటే నేను గొప్పవాడినని భావించడం **'గర్వము'**. విద్య, ధనము మొ॥న వాటిని ఇతరులతో సమానంగా పొందాలనుకోవడం **'మత్సరము'**. ఇతరుల ఎదుట తన జప ధ్యానాదులను ప్రదర్శించడం **'దంభము'**.

ఈ విధాలైన దోషాలు లేనివాడు ప్రశాంతచిత్తుడు. ఈ పైన చెప్పిన దర్పము మొ॥న దోషాలు వున్నవాడు జ్ఞాన సంపాదనకు అర్హుడు కాడు. భగవద్గీతలో చెప్పిన ప్రకారము అసురరాక్షస సంపదలను విడిచిపెట్టి, దైవీసంపదను అలవర్చుకున్నవాడే ప్రశాంతచిత్తుడు.

ఈ విషయంలో ప్రశ్నోపనిషత్తులో ఇలా చెప్పబడి వుంది:-

పిప్పలాదుడు అనే పేరుగల ముని దగ్గరకు భరద్వాజుడు మొ॥న ఋషులు ఆరుగురు చేతిలో సమిధలు పట్టుకొని వెళ్లారు. వారిని పిప్పలాదుడు "మీరెందుకు ఇలా వచ్చారు?" అని అడిగాడు. "మేము బ్రహ్మవిద్యను నేర్చుకోవడానికి వచ్చాము" అని వారు సమాధానమిచ్చారు.

అప్పుడు పిప్పలాదుడు ఇలా అన్నాడు: "బ్రహ్మవిద్య ఇలా లభించదు. మీరు ఒక సంవత్సరం పాటు నా దగ్గరే వుండండి. తర్వాత చెబుతాను."

ఆయన వారిని ఒక సంవత్సరం పాటు తన దగ్గర వుంచుకోవడంలోని ఉద్దేశము వారి అర్హతను తెలుసుకోవడమే!

బ్రహ్మవిద్య రహస్యంగా వుంచబడేది. అధికారియే (అర్హత వున్నవాడే) దానిని పొందేవాడు, ఆచరించేవాడు కూడా!

## అనధికారికి అర్పించిన బ్రహ్మవిద్య నిష్ఫలము

బ్రహ్మవిద్య ప్రస్తుతము నాటక స్థాయికి చేరింది. మహారాజు హరిశ్చంద్రుడు సత్యం కోసం రాజ్యము మొ॥న వాటిని త్యజించి (విడిచి) ఎన్నో కష్టాలను భరించారు. ఈ విషయం యిప్పుడు నాటకం ద్వారా చూపబడుతున్నది. హరిశ్చంద్రుడిగా నాటకంలో పాత్ర ధరించినవాడు రోజంతా ఎన్నో అబద్ధాలు చెబుతాడు. కానీ నాటకంలో మాత్రము సత్యవ్రతము అవలంబించేవాడిగా అభినయిస్తాడు. ప్రజలు 'హరిశ్చంద్రుడి గొంతు చాలా బాగుంది. చంద్రమతి ఎంత అందంగా వుందో! దృశ్యాలు ఎంతో బాగున్నాయి' అని ప్రశంసిస్తారు. అలాగే మాలాంటివారు కొంతమంది

ఉపన్యాసాలు చెప్పేటప్పుడు ప్రజలు నాటకాలకు వెళ్ళినట్లే భార్యాపిల్లలతో సహా వెళతారు. ఉపన్యాసాలు వింటారు. కానీ సత్యం యొక్క తత్వాన్ని గ్రహించగలిగే సామర్థ్యము కలుగదు. 'ఉపన్యాసము బాగుంది. ఉపన్యాసకులు గొప్పవిద్వాంసులు' అని అనేక విధాలుగా పొగిడి సంతోషిస్తారు. ప్రజలు మొదటగా ఒక నాటక కంపెనీని బాగా పొగుడుతారు. తరువాత రెండవ నాటక కంపెనీని దానికి మించి పొగుడుతారు. మూడవ నాటక కంపెనీని పై రెండింటి కంటే ఎక్కువగా కీర్తిస్తారు. అదేవిధంగా ఒక ఉపన్యాసకుడిని 'వ్యాకరణ పండితుడు' అంటారు. మరొక ఉపన్యాసకుడిని 'మొదటి వాడికంటే తర్కంలో (logic లో) దిట్ట' అని ప్రశంసిస్తారు. మూడవ వక్త యొక్క ఉపన్యాస ధోరణి పై ఇద్దరి కంటే ఉన్నతమైనదని పొగుడుతారు. శృతి, స్మృతులన్నీ అతనికి కంఠస్థాలని అంటారు. ఇలా నటీనటులను పొగిడినట్లు ఉపన్యాసకులను కూడా పొగిడి, టికెట్లు కొనినట్లుగానే కానుకలను కూడా ఇస్తారు.

ఈ విధంగా చెప్పిన, వినిన ఉపన్యాస సారాంశాన్ని ఆచరణలో పెట్టడానికి వినేవాడు గాని, చెప్పేవాడు గాని ఎవరూ ప్రయత్నించరు. ఈ విషయాన్ని గమనించిన మహాపురుషులు ఉపదేశం చేయరు. ఎందుకంటే అనధికారికి (అర్హత లేనివాడికి) బ్రహ్మవిద్యను ఉపదేశించినట్లయితే చవిటి నేలలో వేసిన విత్తనం లాగా వ్యర్థమవుతుంది. అర్హతలేని శ్రోత (వినేవాడు) కూడా బ్రహ్మవిద్యను ఆచరించకపోవడం వల్ల దోషం పొందుతాడు. ఆత్మజ్ఞానానికి సంబంధించిన మోహం వల్ల మలినమయ్యే అంతఃకరణను కలిగివుండగానే కర్మను, ఉపన్యాసాన్ని త్యజిస్తాడు. కాబట్టి మహాపురుషులు వివేకము మొ॥న సాధన సంపత్తి కలవారికి మాత్రమే బ్రహ్మవిద్యను ఉపదేశిస్తారు. ఇక మిగిలిన సామాన్య ప్రజానీకానికి నిష్కామకర్మ, ఉపాసన, భగవంతుని అస్తిత్వము(ఉనికి)ను బోధించే ధర్మాలు మొ॥నవి బోధిస్తారు.

బ్రహ్మవిద్యను అనధికారికి (అర్హత లేనివాడికి) ఉపదేశించడం వల్ల కలిగే దోషాన్ని వేదవ్యాస మహర్షి ఇలా చెప్పాడు—

*శ్లో॥ అజ్ఞస్యార్థ ప్రబుద్ధస్య*
*సర్వం బ్రహ్మేతి యో వదేత్।*
*మహానిరయజాలేషు*
*స తేన వినియోజితః॥*

భావం : అజ్ఞానికి, అల్పజ్ఞానికి (జ్ఞానము తక్కువగా వున్నవాడికి) సర్వము బ్రహ్మమే అని ఉపదేశించేవాడు అంతులేని నరకబాధలను పొందుతాడు.

ఒక నగరంలో ఒక సన్యాసి చతుర్మాస్యాలు చేశాడు. చతుర్మాస్యాల నాలుగు నెలలూ వేదాంత ఉపన్యాసాలు చేశాడు. ఒక నిష్ఠ కలిగిన బ్రాహ్మణుడి భార్య 4 నెలలుగా ఆ ఉపన్యాసాలను విన్నది. ఆమె నాలుగు మహావాక్యాల అర్థాన్ని విని, వాటి అంతరార్థము తెలుసుకోలేక బయటకు కనిపించే అర్థాన్ని మాత్రమే గ్రహించి 'అహం బ్రహ్మాస్మి' అయిపోయింది. తరువాత ఒక రోజున ఆమె వంట చేసి వైశ్యదేవము చేయకుండానే భోజనానికి కూర్చుంది. అపుడామె భర్త ఆమెని యిలా అడిగాడు : వైశ్యదేవం చేయకుండానే నువ్వు భోజనం ఎలా చేస్తావు?

ఆమె భోజనం చేస్తూనే ఇలా సమాధానం చెప్పింది:-

*శ్లో॥ అహం వైశ్వానరో భూత్వా*
*ప్రాణినాం దేహమాశ్రితః।*
*ప్రాణాపాన సమాయుక్తః*
*పచామ్యన్నం చతుర్విధమ్॥*

భావం : నేను జఠరాగ్ని రూపంలో ప్రాణుల శరీరంలో వుండి ప్రాణ, అపాన వాయువులతో కలిసి భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్యములనే నాలుగు రకాల ఆహార పదార్థాలను జీర్ణింపచేస్తాను.

ఇది విని భర్త పొయ్యిలో మండుతున్న కట్టెను తెచ్చి ఆమె శరీరాన్ని అంటించబోయాడు. భార్య 'మొర్రో' అని దూరంగా పారిపోయింది. అది చూసి భర్త ఇలా చెప్పాడు—

*శ్లో॥ నైనం ఛిందంతి శస్త్రాణి,*
*నైనం దహతి పావకః।*
*న చైనం క్లేదయంత్యాపో*
*న శోషయతి మారుతః॥*

భావం : ఈ ఆత్మను శస్త్రాలు ఛేదించలేవు. అగ్ని మండించలేదు. నీరు తడపలేదు. గాలి ఆర్పలేదు.

తాత్పర్యమేమిటంటే అర్హత లేని శ్రోతకు చెప్పిన ఉపదేశము విపరీత పరిణామాలకు దారితీస్తుంది.

కాబట్టి మహాత్ములు ఉపన్యాసాలకు దూరంగా వుంటారు. ఏమైనా చెప్పినా మామూలు ధోరణిలోనే మాట్లాడుతారు.

ధర్మానికి పునాది నీతి. పునాది లేనిదే ఇల్లు నిలువనట్లుగానే నీతి లేనిదే ధర్మము నిలవదు. శ్రీ సరయుదాస స్వామివారు, శ్రీ జానకిదాస స్వామివారు అద్వైత నిష్ఠాపరులైనా ప్రజలకు సామాన్య నీతి మార్గాన్నే బోధించారు. 'సత్యం పలకండి, సత్యమార్గంలో నడవండి' మొదలైన ఉపదేశాలు చేశారు. ఈ ఇద్దరు మహాత్ముల ప్రభావము వల్ల అక్కడి వాతావరణం సాత్వికంగాను, సౌమ్యంగాను, శాంతంగానూ వుండేది. మాయ యొక్క ప్రభావము అక్కడ ప్రవేశించేది కాదు. కానుకలు, పూజలు సంగతి పక్కన పెట్టండి; పూలు, పండ్లు సమర్పించడానికి కూడా అనుమతి లేదు. ఇటువంటి మహాపురుషుల తరువాత వారికి మఠాలు, ఆశ్రమాలు శిష్యప్రశిష్యులు ఎలా వుంటారు?

## నిర్గుణ ఉపాసన మొదలుపెట్టడానికి ఉపాయము

***'అహం బ్రహ్మాస్మి'*** అనేది అభేదోపాసన వాక్యము. అనధికారి ఈ వాక్యాన్ని విని ఉపాసనను వదిలివేస్తాడు. 'నేనే బ్రహ్మాన్ని', మరి ఎవరిని విమర్శించాలి? నా స్వరూపంలో మూడు కాలాలలోనూ బంధ మోక్షాలు గాని, పాపపుణ్యాలు గానీ లేవు. ఇలా పలుకుతూ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తాడు. కనుకనే మీరు మొదట నిష్కామకర్మ, సగుణబ్రహ్మ ఉపాసన మొ॥నవి ఆచరించి అధికారాన్ని అర్హతను పొందండి. ఆ తర్వాత మీరు నిర్గుణ ఉపాసన చేయగలుగుతారు.

రాఘవ : అది అయినా మా ప్రారబ్ధంలో వుంటేనే కదా జరిగేది?

## పురుషార్థం ద్వారా ప్రారబ్ధంలో మార్పు సంభవము

స్వా॥ని॥ : ఒక బ్రాహ్మణుడు వుండేవాడు. అతనికి భగవంతుని పొందాలని తీవ్రమైన కోరిక కలగడం వల్ల భార్యకు నచ్చజెప్పి అడవుల్లోకి వెళ్లిపోయాడు. అక్కడ అతడు ఒక మర్రిచెట్టు కింద భజన చేయడానికి కూర్చున్నాడు. నారదుడు ఆ మార్గంలో వెళ్తూ ఆ బ్రాహ్మణుని దగ్గరకు వచ్చాడు. ఆ బ్రాహ్మణుడు ఆయనను సేవించి, "మీరు ఎవరు?" అని అడిగాడు.

నారదుడు : నేను ఒక చోట వుండని వాడిని, నారదుడిని. మూడు లోకాలలోనూ సంచరిస్తుంటాను.

బ్రాహ్మణుడు : మహాభాగ్యము. మీరు వైకుంఠానికి వెళ్ళినప్పుడు స్వామివారిని నాయందు దయచూపి ఎప్పుడు నాకు దర్శనము ఇవ్వదలచారో కనుక్కోండి. మళ్లీ మీరు ఎప్పుడు వస్తారు?

నారదుడు : నేను రేపే వెళ్లి ఎల్లుండి సమాధానం తెస్తాను.

నారదుడు వైకుంఠానికి వెళ్లి విష్ణుమూర్తిని ఆ బ్రాహ్మణుడు గురించి అడిగాడు. విష్ణువు 'అతడు దురదృష్టవంతుడని అతడు కూర్చుని వున్న చెట్టుకు ఎన్ని ఆకులు వున్నాయో అన్ని జన్మలెత్తిన తర్వాత దర్శనం ఇస్తా' నని చెప్పాడు. ఆ విషయాన్ని తిరిగి వచ్చి బ్రాహ్మణుడితో ఇలా అన్నాడు— "నాయనా నీవు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇప్పుడు తెలుసుకోకపోవడం మంచిది." కానీ ఆ బ్రాహ్మణుడు అందుకు ఒప్పుకోలేదు. ఎంతో పట్టుపట్టిన మీదట నారదుడు విషయం చెప్పాడు. అది విని బ్రాహ్మణుడు ఆనందంతో పొంగిపోయాడు. "ఆహా! ఎంత అదృష్టం! నాకు భగవంతుడు తప్పకుండా దర్శనం ఇస్తాడు అన్నమాట."

అది చూచిన నారదుడు ఇలా అన్నాడు: ఓరి పిచ్చివాడా చాలా జన్మల తర్వాత కదా?

బ్రాహ్మణుడు : అయినా దర్శనం ఇవ్వడం తథ్యం కదా!

ఇలా పలికి అతడు ఆనందంతో నాట్యం చేస్తూ 'స్వామివారిని దర్శిస్తాను', 'స్వామివారిని దర్శిస్తాను' అంటూ ఇంకా గంతులు వేయసాగాడు. ఆ విధంగా అతని చిత్తము భగవంతునియందు నిమగ్నమైంది. చిత్తవృత్తి పరమాత్మలో నిమగ్నం అవగానే అతనికి శ్రీమహావిష్ణువు దర్శనమైంది.

ఇది చూడగానే నారదుడికి ఎంతో ఆశ్చర్యం కలిగింది ఆయన శ్రీమహావిష్ణువుతో ఇలా అన్నాడు:

"ఓ నల్లనివాడా! నీవు చాలా మోసగాడివి. ఇది ఏమిటి? నన్ను కూడా పడగొట్టావే. నిన్ననే ఆ చెట్టుకు ఆకులెన్ని వున్నాయో అన్ని జన్మలు ఎత్తితే గాని ఈ బ్రాహ్మణుడికి దర్శనం ఇవ్వనని చెప్పావు కదా ?"

భగవంతుడు : బ్రాహ్మణుడి ప్రారబ్ధం అలా వున్నది. కానీ భక్తి అనే తాటితో నన్ను కట్టడంతోనే నేను భక్తపరాధీనుడిని అయిపోతాను. అహం భక్తపరాధీనః (శ్రీమద్భాగవతము)

యోగ్యమైన పురుషార్థము చేత ప్రారబ్ధాన్ని నివృత్తి చెందించాలి. కాబట్టి మీరు భగవంతుని ప్రేమించండి. మాయాపదార్థాల పట్ల ప్రేమను విడిచిపెట్టండి. **- సశేషం**

# బుద్ధ ధ్యాన హృదయము

(గత సంచిక తరువాయి)

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

## అధ్యాయం - 3

### I. కాయానుపశ్యనము లేక శరీరధ్యానము

*6. స్మశాన ధ్యానాలు:* ఈ ధ్యానానికవసరమైన విషయాలు యెప్పుడో ఒకప్పుడు ప్రత్యేకంగా చూడసాధ్యమైనవే. అట్టి అవకాశం కలుగక పోయినప్పటికీ తామే స్పష్టంగా భావించవచ్చు. ఈ సాధనలో వివిధ స్థాయిలలో కూడిన మృత కళేబరాలను ధ్యానించాలి. ఇంద్రియలోలురైన వారికి, భ్రాంతిని తొలగించడానికి యీ ధ్యానం వల్ల కలిగే జుగుప్స తోడ్పడగలదు. అంతేకాక దేహమశాశ్వతం అన్న సత్యాన్ని కూడా యీ ధ్యానం హృదయగతం చేస్తుంది. ఈ ధ్యానం యితరుల శరీరాలకేగాక యేనాటికైనా ఆ స్థితి (తన శరీరానికి కూడా) తప్పదని గుర్తించి వ్యామోహాన్ని విడనాడతాడు.

రేపో మాపో పక్షులకు, పురుగులకు, నాలుగు భూతాలుగా మార్పు చెందనున్న దేహం తనది అనే భ్రాంతిని పెంచుకోవడం యెంతటి అవివేకమో తెలియగలదు.

శరీరం తాను కాదని వ్యక్తిత్వ రహితమని తెలియడం వలన తాదాత్మ్యము, మోహము తగ్గుతాయి.

ప్రాచీనకాలంలో యీ ధ్యానానికి తగిన వస్తువులు (మృతకళేబరాలు. అస్థిపంజరాలు) చూడనవకాశముండేది. ఈనాడు యుద్ధ రంగాలలోను, ఆస్పత్రులలోను, వైద్య విద్యాలయాలలోను చూడవచ్చును.

ఈ శారీరక ధ్యానాలన్నీ కొంత కేవలశ్రద్ధ సాధనకు, కొంత శుద్ధ అవగాహన సాధనకు చెందుతాయి.

ఇవన్నీ శరీరముపట్ల వైరాగ్యాన్ని కల్గిస్తాయి. కారణం శరీరం యొక్క యదార్థ తత్వాన్ని తెలియపరుస్తాయి. ఈ వైరాగ్యం విషయ వాంఛల పైన నిగ్రహాన్ని, స్వేచ్ఛను యిస్తాయి. శరీరాన్ని ప్రలోపవాసాలతో శుష్కింపచేయనక్కరలేకుండా వైరాగ్యాన్ని పెంపొందించటమే యీ సాధనలోగల వైశిష్ట్యము. అటు యింద్రియ లోలత్వానికి, యిటు శరీరాన్ని శుష్కింపచేయటానికి మధ్యేమార్గము స్మృతి శ్రద్ధ సాధన. ఈ దుఃఖ బాధ నివృత్తి సాధనలో శరీరం తేలిక అవుతుంది. రోగాదులు ప్రాప్తించినపుడు కూడ మనసు నిర్లిప్తంగ వుంటుంది.

### II. భావోద్రేకాల గూర్చిన ధ్యానము (వేదనాను పశ్యనము)

వేదన అను పాళి పదానికి శారీరకము, మానసికము అయిన సుఖ, అసుఖ, తటస్థభావాలు అని అర్థం. ఏ యింద్రియానుభూతికైనా ప్రథమంగా కలిగేది శారీరక, మానసిక ప్రతిక్రియభావం. మనోజయాన్ని పొందేవారు దీని పట్ల ప్రత్యేక శ్రద్ధను వహించాలి. భావానికి ప్రధానమైన కారణం యింద్రియానుభవమనీ, భావం కోరికకు కారణమని, దాని ద్వారా తృష్ణకు (కోరికవలన కలిగిన ఆవేదన ని తృష్ణ అంటారు) కారణమని చెప్పబడింది.

కనుక దుఃఖోత్పత్తికిది మూలకారణం. అందుకే దుఃఖ నివారణలో యిది ప్రథమస్థానాన్ని ఆక్రమిస్తుంది.

ఇంద్రియానుభూతి కలిగినపుడు మనస్సును భావాన్ని పొందే దశలో నిలిపి దానిని కేవలశ్రద్ధకు గురిచేస్తే తృష్ణాదులు నివారణౌతాయి. అంతఃకరణ తృష్ణాదులను పొందక యింద్రియానుభూతి సుఖం, అసుఖం తటస్థమని గుర్తించడంలో నిలిచి పోతుంది. ఆ దశలో అంతవరకు సాధించబడిన శుద్ధ అవగాహన ఆ వస్తువుపట్ల సరైన వైఖరిని నిలుపుతుంది. దాని యదార్థ తత్వ అవగాహన ద్వారా - అంతేకాక కేవలశ్రద్ధ ద్వారా భావం మరొక కారణాన్ని ఆక్రమించుకొని ఉత్పత్తి అవుతుందని క్రమంగ నశించి మరొక భావానికి తావిస్తుందని గుర్తించినపుడు ఆ భావ ప్రవాహంలో కొట్టుకుపోనవసరంలేదని అలా కొట్టుకుపోతే దుఃఖకారణం చోటు చేసుకుంటుందని ప్రత్యక్షంగా సాధకుడు గుర్తిస్తాడు.

క్రమబద్ధమైన స్మృతి సాధనలో సాధకుడు శారీరక ధ్యానాలను సాధించటంలో సౌలభ్యాన్ని సాధించినపుడు గురువు అతనిని ఆ సాధనపట్ల తనలో కలిగే తృప్తి, అసంతృప్తి అనే భావాలపై దృష్టిని కేంద్రీకరించమని చెప్తాడు. గురువులేకుండా సాధన చేసేవాళ్ళు కూడ అలానే చేయవచ్చు.

ఈ తృప్తి, అసంతృప్తులు కేవలం భావాలు మాత్రమే కాక, అంతకంటే విశేషమైనవి కాని కేవలశ్రద్ధకు గురిచేసినపుడు వాటిలోని వ్యక్తిగతాంశాలు, వాటిలోగల తాదాత్మ్యం తొలగిపోతాయి. కేవలం సుఖ అసుఖాది అనుభూతులుగా మాత్రమే గుర్తించబడతాయి. కనుక సాధకుని యేలక్ష్యం వైపునుండి ప్రక్కకు తోసివెయ్యజాలవు.

జీవితంలో యీ భావాలు ప్రబలంగా కలవారిని భావోద్రేక స్వభావులు అంటాము. అట్టివారు సుఖాది భావాలలో తిరిగితిరిగి ఉద్రేక పూర్వకంగా నిమగ్నులై వాటికి తగనంతటి ప్రాధాన్యాన్నిస్తారు. అందువల్ల పరిస్థితి ఉన్నదానికంటే యెక్కువగ కనుపించి తీవ్రమైన ప్రతిక్రియను వారిలో కల్గిస్తుంది. ఇది పొంగడం కావచ్చు, కుంగడం కావచ్చు. అతిగా విలువ నివ్వడం కావచ్చు. చులకన చేయడం కావచ్చు. వీటిలో స్వాధీనం తప్పుతుంది. క్రమంగా యిదే వారి స్వభావంగా మారుతుంది. తదనుశృతమైన బంధాలు కలుగుతాయి. తాను అతిగా విలువకట్టిన వస్తువు విలువ లేనిదని తెలిసినపుడు నిరుత్సాహము, పరిస్థితి ఉన్నదానికంటే ప్రమాదకరంగా తోచినపుడు అతిభయము, తద్విరుద్ధమైనపుడు మితిమీరిన అలక్ష్యము లాంటివి కలుగుతాయి. సాధారణంగా ప్రజలు యిది నా ప్రాణం అని, యిది నాకు మృత్యుతుల్యమని అనటం వింటుంటాం. స్మృతి సాధకుడు అవే అనుభవాలను యిదిగూడ ఒక ముఖ్యమైన భావమే అనిగాని, యిదికూడ ఒక అనుభవం మాత్రమే అనుకుంటాడు. దీనివలన మనస్థైర్యము, శాంతి కలుగుతాయి. అట్టివానిని విషమ పరిస్థితులు కూడా చలింపజేయలేవు.

అదుపు తప్పిన భావాలు వస్తువులకు, వ్యక్తులకు అతిగా విలువనాపాదించేలా చేస్తాయి. ఆ విలువలు అవాస్తవమని, అనుచితమని కూడ తెలియనియ్యవు. ఆ విషయాలు మరొక వైఖరి లేక దృష్టి కలిగియుండడం సముచితమేనని తెలియక సాటివారి భావాలను అలక్ష్యం చెయ్యడంగాని, గాయపరచడం గాని జరుగుతుంది. సామాన్యంగ ఆ సాటివారి స్థితి గూడ అలానే వుంటుంది. కనుక జీవితంలో సంఘర్షణ తప్పదు. అట్టి స్థితిలో సమ్యక్ స్మృతి సాధన భావాలను గూడ నిర్లిప్తంగా గుర్తించడం నేర్పి సాటివారి భావాలను గూడ సహనంతో గౌరవంతో అవగాహన చేసుకొనేలా చేసి సంఘర్షణలను నివారిస్తుంది.

అప్పుడే ఉత్పన్నమైన భావాన్ని సుఖము, అసుఖము, తటస్థము అని మాత్రమే మొదట స్మరించాము అని మూల సూత్రం చెబుతుంది. తఋవాత దానికి ఆ భావము ప్రాపంచికమైనదో, అతీతమైనదోనన్న లక్షణాన్ని కూడా గుర్తించామని చెబుతుంది. ఇలా నిర్లిప్తంగా గుర్తించే సాధన మన భావాలను పరిశుద్ధం చేసి ఉత్తమ భావాలను పెంచి అధమభావాలను నివారిస్తుంది. ఈ పద్ధతి– భావం యొక్క యదార్థతత్వాన్ని నిర్లిప్తంగ గమనించడం -- భావాలను ప్రతికూల భావాలతో (అంటే వ్యామోహాన్ని అసహ్యభావంతో) ప్రతిఘటించే పద్ధతికంటే మెరుగైనది. భావోద్రేకాలలో మునిగి తేలేవారు కేవలం శాస్త్రాలో, పెద్దలో చెప్పిన సిద్ధాంతాల సహాయంతో తమలోని భావాలను మార్చుకోజాలరు. స్మృతిసాధనలో తమకు కలిగిన భావాలతత్వాన్ని తామే స్వయంగ గుర్తించటం జరుగుతుంది గనుక నిస్సంశయముగ స్వానుభవమే వారి భావాలలోగల వైషమ్యాన్ని గమనించగలదు. భావాల విషయమేగాక భావోద్రేకాల విషయంగూడ యింతే.

**- సశేషం**

# భగవాన్ శ్రీ భరద్వాజ

శ్రీమతి శ్రీదేవి

## అధ్యాయం - 3

## విద్యాభ్యాసం

(గత సంచిక తరువాయి)

కళాశాల విద్యార్థిగా ఆయన జీవితం చాలా విలక్షణంగా వుండేది. కేవలం ఆయన బాహ్య వేష భాషలు, నడవడిక మాత్రమే కాదు, ఆయన ఆలోచనావైఖరి కూడా ఎంతో నిర్దుష్టంగా వుండి జీవిత విలువల్ని ఎంతో ఉన్నత ప్రమాణాలతో దర్శింపజేస్తూ వుండేది. అందరి పిల్లలవలె భరద్వాజగారు జీవనోపాధి సంపాదించేందుకు మాత్రమే విద్యను అభ్యసించటం కోసం కళాశాలలో చేరలేదు. అప్పటి వరకు శ్రీ అనంతాచార్య తమ పిల్లలను ఏ విద్యాలయాలకూ పంపక తామే గురువై వారికి విద్యను బోధించారు. అంతేకాదు ఇతర పిల్లల సాంగత్యంలో బయటి ప్రపంచపు కాలుష్యాలేవీ స్వచ్ఛమైన తమ పిల్లల మనస్సులకు అంటకూడదనే ఉద్దేశంతో ఆడుకునేందుకు కూడా యితర పిల్లలతో కలువనీయక తమ నలుగురు పిల్లలే వాళ్ళకు వాళ్ళు ఆడుకునేలాగా ప్రోత్సహించారు. బాహ్య ప్రపంచంలోకి అడుగుపెట్టి కళాశాలలో చేరిన భరద్వాజగారు కేవలం విద్యలనే కాదు, బాహ్య ప్రపంచపు తీరు తెన్నులు, లోకం పోకడలు, నేటి యువకుల ఆలోచనా వైఖరులు అన్నీ అవగతం చేసుకున్నారు. దిగజారిపోయిన మానవ విలువలపై, ముఖ్యంగా పతనమౌతున్న ఆధునిక యువతపై ఆయనకు తీవ్ర పరితాపం, వారు ఎలా ఉద్ధరింపబడతారా అన్న ఆవేదన, వారి ఉన్నతికి తాను ఎలా ఉపకరించగలనా? అన్న ఆలోచన ఆయన హృదయంలో జనించి, భవిష్యత్తులో లోకోద్ధరణ అనే సంకల్పం పుష్పించి, ఫలించేందుకు అప్పుడే అంకురార్పణ జరిగిందని చెప్పవచ్చు.

భరద్వాజగారికి నాటి సామాజిక పరిస్థితులపై తీవ్ర వ్యతిరేకత వుండటం వలన ఆ విషయాల గురించి సాటివారితో సాగే చర్చలలో కూడా కొంత కరకుదనం తొంగిచూసేది. విద్యార్థుల వింత పోకడలకు ఆయన స్పందన తీవ్రంగా వుండేది. అందుకు కొన్ని ఉదాహరణలు –

సాటి విద్యార్థులతో విలాసాలలో కలువక ఎప్పుడూ చదువుపై దృష్టి నిగిడ్చే భరద్వాజగారు తోటి విద్యార్థులకు చాలా అమాయకుడిలాగా కన్పించేవారు. “ఎప్పుడూ చదువేనా? లైఫ్‌ని ఎంజాయ్ చెయ్యటం కూడా చేతకావాలి” అంటూ ఆయనని ఎగతాళి చేస్తుండే సాటి విద్యార్థులకు, “విద్యాలయాలు వున్నది విద్యను నేర్పించటానికి. విద్యాలయాల్లో చేరేది విద్య నభ్యసించటానికి. అంతేకానీ విద్యాలయాలంటే విలాస మందిరాలు కాదు, ఫ్యాషన్ సెంటర్లు అంతకంటే కాదు. నేను ఎందుకు వచ్చానో ఆ పని నెరవేర్చుకొనటమే నాకు యిష్టం. అంతకుమించి వేరే కాలక్షేపాలు నాకనవసరం” అంటూ నిష్కర్షగా సమాధానం యిచ్చారు.

ఉపనయన సమయంలో స్నేహితులు, “నువ్వు యిప్పుడు గుండు చేయించుకొని పంచశిఖలు పెట్టించుకోవలసి వుంటుంది, అలా పంచశిఖలతో కాలేజీకి వెళ్తే అందరూ ఎగతాళి చేస్తారు” అన్నారు. “ఎవరేమనుకున్నా నాకు లెక్కలేదు” అని చెప్పి ఉపనయనంలో గుండు చేయించుకుని, పంచశిఖలతోనే కాలేజీకి వెళ్ళారు భరద్వాజగారు. కాలేజీలో

విద్యార్థులంతా భరద్వాజగారిని చూసి నవ్వడము, కామెంట్స్ చేయడము మొదలెట్టారు. వారి కామెంట్స్ కి ఏమాత్రం చలించని భరద్వాజగారు, "తలలో ఏమీ లేనివాడికి తలపైన జుట్టు ప్రధానం. తలలో కావాల్సినది వున్నవాడికి జుట్టు వున్నా, లేకపోయినా ఒక్కటే!" అన్నారు. ఈ సమాధానం విని నవ్వుతున్న కుర్రాళ్ళు అవాక్కయ్యారు.

ఒకరోజు కాలేజీలో భరద్వాజగారు క్లాసురూమ్ లో అందరు విద్యార్థులతో పాటు కూర్చునివున్నారు. ఫిజిక్స్ క్లాస్ జరుగుతున్నది. భరద్వాజగారు ఎటో చూస్తూ పరధ్యానంగా వుండి, పాఠంమీద దృష్టి పెట్టడంలేదని అనిపించింది లెక్చరర్ కి. వెంటనే భరద్వాజగారిని లేపి, "నువ్వు సరిగ్గా పాఠం వినటంలేదు" అన్నారు. "లేదు, నేను పాఠం వింటున్నాను" అన్నారు భరద్వాజగారు. "అయితే, వచ్చి బోర్డుపై ప్రాబ్లమ్ వ్రాసి సాల్వ్ (solve) చేయి" అన్నారు లెక్చరర్. భరద్వాజగారు లేచి వెళ్ళి, బోర్డుపై ప్రాబ్లమ్ సాల్వ్ చేసి తర్వాత లెక్చరర్ ఏ విధంగా అయితే ప్రాబ్లమ్ కింద గీత గీస్తాడో అదే విధంగా గీత గీచి " understand? (అర్థమైందా?)" అన్నారు.

ఇంటర్ చదివేటప్పుడు కొన్ని సబ్జెక్ట్సలో ఫెయిల్ అయిన భరద్వాజగారు తమ ఫ్రెండ్స్ అందరినీ పార్టీకి పిలిచారు. "పార్టీ యివ్వటానికి కారణం ఏమిటి?" అని అడిగారు స్నేహితులు. "ఏమీ లేదురా. నేను యింటర్ ఫెయిలయ్యాను. ఆ సంతోష సమయంలో యీ పార్టీ ఏర్పాటు చేశాను" అన్నారు. స్నేహితులంతా పకపకా నవ్వారు. అందులో ఒక ప్రబుద్ధుడు చాలా ఎగతాళిగా, "ఓహో! చాలా బాగుంది! ఇంత గొప్ప సందర్భం మళ్ళీ వస్తుందా? తప్పకుండా పార్టీ యివ్వాల్సిందే మరి!" అన్నాడు. మరొక ఆకతాయి అతి తెలివిగా, "కాదా మరి? పాసవుతే పార్టీ యివ్వట మేమిటి? అదేమన్నా సంతోష సమయమా? ఫెయిలవుతేనే పార్టీలు చేసుకోవాలని వీరి దగ్గరే నేర్చుకుందాం!" అంటూ పగలబడి నవ్వాడు. భరద్వాజగారు తాము కూడా నవ్వుతూ, "అవును మరి! మీలాంటి వాళ్ళకి పాసయ్యే అవకాశం ఎప్పుడో ఒకసారి వచ్చినట్లే, నాకు ఫెయిలయ్యే అవకాశం ఎప్పుడో ఒకసారి వస్తుంది. ఈ అపూర్వ అవకాశం మళ్ళీ రాదనే వుద్దేశంతోనే యీ పార్టీ" అన్నారు. భరద్వాజగారిని హేళన చేసిన ప్రబుద్ధుల ముఖాలు వెలవెలాపోయాయి.

యం.ఏ (M.A) చదివే రోజుల్లో వారి కుటుంబం ఎన్నో ఆర్థిక యిబ్బందులలో వున్నది. ఆ రోజుల్లో ఆయన కాళ్ళకు చెప్పులు కూడా లేకుండా, ఇస్త్రీలేని ఉతికిన చొక్కా, నిక్కరు ధరించి కాలేజీకి వెళ్ళేవారు. పుస్తకాలు కొనేందుకు డబ్బుల్లేక పోవటంతో స్నేహితులు నిద్రపోయే సమయంలో తాము మేలుకొని, వారినుండి పుస్తకాలు తీసుకొని చదివేవారు. నోట్సులు కొనుక్కునే తాహతు లేక పేపర్ల మీద నోట్సు రాసుకుని చదువుకుంటూ వుండేవారు. అటువంటి క్లిష్ట పరిస్థితులలో కూడా ఏ మాత్రం అధైర్యపడక, నిరాశ చెందక ఆ పరిస్థితులను ఎంతో ఓర్పుతో ఎదుర్కొని విద్యాభ్యాసం కొనసాగించి, విజయం సాధించారు శ్రీ భరద్వాజగారు.

భరద్వాజగారు కాలేజీలో చదివే రోజుల్లో చాలామంది ఆడపిల్లలు భరద్వాజ గారంటే యిష్టపడేవారు. ఆయనతో మాట్లాడాలని, స్నేహం చేయాలనీ ప్రయత్నించేవారు. ఒకమ్మాయి "నేను నిన్నెంతగానో ప్రేమిస్తున్నాను. నీవు లేకుంటే బ్రతకలేను. నీవు నన్ను పెళ్ళి చేసుకోకపోతే నేను ఆత్మహత్య చేసుకొని చచ్చిపోతాను" అని ప్రేమలేఖ వ్రాసింది. అది చూచిన భరద్వాజగారు ఆ అమ్మాయికి, "నేను నిన్ను పెళ్ళి చేసుకోకుంటే నువ్వు ఆత్మహత్య చేసుకుంటావో లేదో తెలియదు కానీ, నేను మాత్రం నిన్ను పెళ్ళి చేసుకుంటే చనిపోయేది ఖాయం. అలా చనిపోవటం నా కిష్టం లేదు" అని జవాబు వ్రాశారు. ఆ సమాధానానికి ఆ అమ్మాయి దెబ్బ తిన్నట్లుగా ఫీలయి, "వయస్సులో వున్న అందమైన అమ్మాయి ప్రేమించానని వస్తే తిరస్కరిస్తున్నావు. నీకు మగతనం లేదా?" అన్నది. ఆ మాటకు భరద్వాజగారు మరింత ఉత్సాహంగా నవ్వుతూ, "నాకు స్త్రీ వ్యామోహం వుండేది కానీ నిన్ను చూడగానే పూర్తిగా నశించిపోయింది" అన్నారు. ఆయన చెప్పిన యీ సమాధానంలో ఆ అమ్మాయిని గురించిన భవిష్యద్వాణి కూడా దాగి వుంది కాబోలు, ఆ తర్వాత ఆ అమ్మాయికి వివాహమైంది. కానీ కొద్దికాలానికే ఆమె భర్త మరణించాడు.

కాలేజీ చదువు ముగించి, పి.జి చేయాలని నిశ్చయించుకొన్న భరద్వాజగారు వైజాగ్ లోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చేరారు. హర్షవర్ధన్ హాస్టలుకి వెళ్ళినపుడు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ గారు యితనికి రూమ్ యివ్వటానికి యిష్టపడక రూములు ఖాళీ లేవని అబద్ధం చెప్పారు. రూములు ఖాళీ అయ్యేంత వరకు బయట వరండా లోనే వుండగలనని, ఖాళీ అయిన తర్వాతనే రూము యిప్పించండనీ అన్నారు భరద్వాజగారు. ఆయన పట్టుదల, నిర్భయత్వం చూసిన ప్రిన్సిపాల్ గారు ఆయనికి రూము యిప్పించారు. ఆయన భయపడాలనే వుద్దేశంతో కొందరు తమాషాకు ఆయన గదిలో అస్థిపంజరాన్ని వుంచారు. కానీ

భరద్వాజగారు ఏ మాత్రం భయపడక పోవడం చూసి అంతా ఆశ్చర్యపోయారు. మరోసారి భరద్వాజగారి వాకిలి వద్ద నాగుపాము ప్రవేశించి పడగ ఎత్తి నిలచింది. ఆయన బయటకు వెళ్ళే అవకాశమే లేదు. హాస్టల్ విద్యార్థులంతా రూము బయట నిలబడి ఏమీ చేయలేక చూస్తూ నిలబడ్డారు. అపుడు భరద్వాజగారు తమ లుంగీ తీసి పాముపై విసరగానే అది పడగదించి తన పైన పడిన లుంగీ నుండి బయటకు తప్పించుకొనటానికి ప్రయత్నించే సమయంలో భరద్వాజగారు గది నుండి బయటకు వచ్చేశారు. ఆయన సమయస్ఫూర్తికి అంతా ఎంతో సంతోషించారు. ఆ రోజులలో ఆయన సాటి విద్యార్థులలో కూడా 'ఒక మంచి విద్యార్థి' గా వారి అభిమానాన్ని చూరగొన్నారు. ఆయన 1959వ సంవత్సరంలో వైజాగ్ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆంగ్లంలో పట్టభద్రులైనారు.

# అధ్యాయం - 4

## ఉపనయనం

వాల్మీకి శోకపూరిత హృదయం నుండి శ్లోకం జనించింది. అదే శ్రీ మద్రామాయణ మహాకావ్య రచనకు ఆరంభ గీతికగా ఆలపించబడింది. అదే విధంగా 1955వ సంవత్సరంలో శ్రీ భరద్వాజగారి జీవితంలో జరిగిన అత్యంత విషాదకర సంఘటన, కారణజన్ముడైన ఆ మహనీయుని జీవితం గొప్ప మలుపు తిరగడానికి కారణభూతమైంది. అవతార పురుషుడైన భరద్వాజగారి జీవిత లక్ష్యాన్ని నిర్దేశించటానికి నిమిత్తమాత్రమై ఆయనను లోకోద్ధరణకు అంకితం చేసి తమ తుదిశ్వాస వరకు ఆ లక్ష్యసాధన వైపు పయనింపజేసిన ఆ దయనీయ ఘట్టం ఆయన జీవితంలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకొన్నది. సృష్టి విలాస క్రీడాకారుని సంకల్పాన్ననుసరించి ఈ విషాద సన్నివేశం ద్వారా భరద్వాజగారి హృదయంలో ఆరంభమైన అంతర్మథనం, కొనసాగిన అన్వేషణ, అనంతరం జరిగిన అపూర్వ పరిణామాలు, అనాది నుండి నేటి వరకు సంభవించిన అనేకమంది మహనీయుల జీవిత ఘట్టాలలోవలెనే ఆయన గత జీవిత రూపు రేఖలను పూర్తిగా మార్చివేశాయి. యోగుల, మహనీయుల, అవతార పురుషుల జీవన గమనాలను చాటిచెప్పే ఆధ్యాత్మిక ప్రపంచంలోనే చారిత్రాత్మకమైన ఆయన జీవితంలోని యీ అద్భుత పరిణామాలు మానవ జీవితగమ్యాన్ని నిర్దేశిస్తూ లోకానికి ప్రబోధాత్మకాలై, స్ఫూర్తిదాయకాలై విలసిల్లాయి.

అవి భరద్వాజగారు గుంటూరు హిందూ కాలేజీలో యింటర్ చదివే రోజులు. కృష్ణమాచార్యులు గారికి ద్వితీయ పుత్రుడు భాస్కరాచార్య జన్మించాడు. తెల్లగా, బొద్దుగా, ఎంతో ముద్దుగా వున్న ఆ బాబు పదిహేనేండ్ల పిల్లవాడైన భరద్వాజ గారిని ఎంతగానో ఆకర్షించాడు. సుకుమారమైన శరీరంతో, బోసి నవ్వులొలికించే ఆ శిశువు చిన్నవాడైన భరద్వాజగారికి కదిలే బొమ్మలాగ కనిపించేవాడేమో, ఆయన ఆ బిడ్డను ఎంతో మురిపెంగా ఎత్తుకు తిప్పుతూ, ముద్దులాడుతూ, ఆడిస్తూ, ఎప్పుడూ ఆ పిల్లవాడితోనే కాలం గడుపుతుండేవారు.

రెండు సంవత్సరాలు గడచిపోయాయి. ఈ రెండేళ్ళలో భరద్వాజగారికి బాబు పైనా, బాబుకు భరద్వాజగారిపైనా మమతానుబంధాలు గాఢంగా పెనవేసుకు పోయాయి. భాస్కరాచార్యకు భరద్వాజగారే సర్వస్వం. ఆయనే లోకం. నిద్ర లేచింది మొదలు స్నానం చేయించటం, తల దువ్వటం, బట్టలు తొడగటం, టిఫిన్ తినిపించటం వంటి పనులన్నీ తనకు బాబాయిగారే చేయాలి. ఎప్పుడూ "బాబాయ్! బాబాయ్!" అంటూ ఆయన వెంటే తిరుగుతూ ఒక్కక్షణం కూడా బాబాయిని వదిలి వుండేవాడు కాదు భాస్కరాచార్య. రాత్రి నిద్రించే సమయంలో కూడా బాబాయి ప్రక్కనే పడుకొని ఆయన చెప్పే మాటలు, కథలు వింటూ నిద్ర పోయేవాడు. ఇక భరద్వాజగారికి బాబుతో గడపటాన్ని మించిన ఆనందం వేరొకటి లేనే లేదు. కాలేజీకి వెళ్ళిన సమయం తప్ప యింట్లో వున్నంతసేపు ఆయనికి భాస్కరాచార్య తోడిదే లోకం.

- సశేషం

(గత సంచిక తరువాయి)

# శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

శ్రీమతి శ్రీదేవి

డెహ్రాడూన్ లో అమ్మ భక్తులందరికీ తమ దర్శన భాగ్యాన్ని ప్రసాదిస్తున్నారని విని ఢాకా, కలకత్తా యింకా యితర ప్రాంతాల నుండి అనేకమంది భక్తులు డెహ్రాడూన్ వచ్చి అమ్మ సన్నిధిలో గడపసాగారు.

జ్యోతిష్ దాదా వుద్యోగ విరమణ చేసి అమ్మ చెంతనే వుండసాగాడు. అమ్మను సేవించుకుంటూ యెంతో ఆనందంతో తన సాధన కొనసాగిస్తున్నాడు. అతని వేష భాషలలో కూడా చాలా మార్పు వచ్చింది. అతడు ఒక అంగవస్త్రం మాత్రమే ధరిస్తూ, ఒంటిపై చొక్కా ధరించడం కూడా మానివేశాడు. చెప్పులు కూడా ధరించడం లేదు. అమ్మ క్రమక్రమంగా అతని సాధనలో నియమనిష్ఠలు మరికొన్నింటిని విధించారు. వాటిలో ముఖ్యమైనది వారంలో ఒకరోజు జ్యోతిష్ దాదా కేవలం భిక్షాన్నం మాత్రమే భుజించాలన్న నియమం. భిక్షాన్నం లభించని రోజున రోజంతా వుపవసించి గడపాలని అమ్మ చెప్పారు.

లోగడ ఢాకా లో ఒకరోజు అమ్మ గదిలో అమ్మతోపాటు జ్యోతిష్ దాదా, నందూ కూర్చొని వున్న సమయంలో అమ్మ వారితో "మనం ముగ్గురం బ్రాహ్మణులం" అనడం జరిగింది. ఆ తర్వాత రమణాశ్రమంలో అమ్మ ఒక రోజున తన మెడలో వున్న యజ్ఞోపవీతం జ్యోతిష్ దాదా మెడలో వేశారు. డెహ్రాడూన్ లో అమ్మ జ్యోతిష్ దాదాను తన పుత్రునిగా ప్రకటించడం అందరిని దిగ్భ్రాంతులను చేసింది. అదెలా జరిగిందంటే- ఒకరోజు అమ్మ భక్తుల మధ్య కూర్చుని సంభాషిస్తున్నారు. వున్నట్టుండి అమ్మ "జ్యోతిష్ దాదా ను పిలవండి" అన్నారు. అతడు రాగానే అతనిని తన ప్రక్కనే కూర్చోబెట్టుకొని, భక్తులందరిని చూస్తూ, "చూడండి! యితడు యెవరనుకుంటున్నారు? సాక్షాత్తు నా ధర్మపుత్రుడు!" అన్నారు. "మీరంతా యితనిని నా కన్న కుమారునిగా భావించాలి" అని కూడా అన్నారు. శ్రీ ఆనందమయి అమ్మ జ్యోతిష్ దాదా ను స్వయంగా తన పుత్రుడుగా ప్రకటించడం చూచి అందరూ అతని అదృష్టాన్ని యెంతగానో కొనియాడారు.

శ్రీ ఆనందమయి అమ్మ మొదటి నుండీ కూడా జ్యోతిష్ దాదాను తన పుత్రుని వలెనే ఆదరించేవారు. ఆయన కూడా అమ్మతో కొంత స్వేచ్ఛగా వ్యవహరించేవాడు. అమ్మ అందరితో జ్యోతిష్ దాదాను తన ధర్మపుత్రుడుగా ప్రకటించినప్పటి నుండి అతని పట్ల భక్తుల భావం పూర్తిగా మారిపోయింది. అందరూ అతనిని యెంతగానో ప్రేమిస్తూ, అభిమానిస్తూ అతనిని గౌరవించసాగారు. ప్రతి ఒక్కరూ ఆయనను 'అన్నయ్యగారు' అని పిలవటం మొదలుపెట్టారు.

డెహ్రాడూన్ లో వుంటున్నప్పుడు అమ్మ జీవన విధానంలోనూ వేష భాషల లోను బాగా మార్పు వచ్చింది. అంచులు లేని పొడవైన చీరలను అమ్మ ధరించసాగారు. తలపై కొంగు కప్పుకోవటం పూర్తిగా మానేశారు. జుట్టును ముడి వేయకుండా వదిలేయడంతో యెంతో పొడవుగా వున్న జుట్టు వీపు పైన, భుజాలపైన నిండుగా వ్రేలాడ సాగింది. ఒంటి నిండుగా ఒక పెద్ద దుప్పటి కప్పుకుని తిరుగుతూ చూపరులకు ఒక యువకుడైన బ్రహ్మచారివలె

కనిపించసాగారు. రాత్రి 10 గంటల సమయం నుండి 12 గంటల వరకు రోడ్డుపై నడుస్తూ, ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వెళ్తూ డెహ్రాడూన్ నగరమంతా చుట్టివేయసాగారు. అమ్మ వద్ద విశేషమైన వస్తువులు కూడా ఏమీ లేవు. ఒక గ్లాసు, ఒక కంబళి, రెండు మూడు వస్త్రాలు తప్ప మరేమీ లేవు. జ్యోతిష్ దాదా కూడా చొక్కా, చెప్పులు ధరించడం మానివేశారు. తొమ్మిది మూరల వస్త్రాన్ని ధరించసాగారు.

జ్యోతిష్ దాదా వుద్యోగ విరమణ చేసిన తరువాత పెన్షన్ తీసుకుంటూ గడపసాగారు. ఆయన అమ్మ వద్దనే వుంటూ, యింటికి వెళ్ళటం పూర్తిగా మానివేశారు. గృహస్థాశ్రమం పూర్తిగా త్యజించి, అమ్మ సన్నిధికే అంకితమై పోయారు. ఒకరోజు అమ్మ జ్యోతిష్ దాదాతో, "జ్యోతిష్, నీ భార్యకు నీ భవిష్యత్తు గురించిన నీ నిర్ణయాన్ని తెలియజేయడం నీ ధర్మం. మీరిద్దరూ కలిసి ఎక్కడైనా పుణ్యక్షేత్రంలో – కాశీలోనైనా, హరిద్వార్ లోనైనా వుండవచ్చు. ఇకముందు నీవు ఢాకాలో నీ యింటినీ, గృహస్థ జీవితాన్నీ పూర్తిగా వదిలివేయవలసి వుంటుంది. ఈ విషయాన్ని నీ భార్యకు చెప్పు. ఆమెను నీతో కలిసి జీవించడానికి ఒప్పుకునేలా నీ ప్రయత్నం నీవు చేయి" అన్నారు. జ్యోతిష్ దాదా అమ్మ చెప్పినట్లే తన వద్దకు వచ్చి తనతో కలిసి జీవించమని తెలియజేస్తూ రెండు మూడుసార్లు వుత్తరాలు వ్రాశాడు. కానీ ఫలితం శూన్యం. ఆమె అందుకు అంగీకరించలేదు. ఆమె ఢాకా విడిచి రావటానికి ఎంత మాత్రమూ యిష్టపడలేదు. జ్యోతిష్ దాదాకు ఒక్కడే కుమారుడు. అతని పేరు రామానంద. జ్యోతిష్ దాదా భార్య, కుమారుడు యిద్దరూ ఢాకాలోని భగవాన్ బ్రహ్మచారి అనే యోగి వద్ద దీక్షా గ్రహణం చేసి గురువు ఆదేశం ప్రకారం సాధన చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. జ్యోతిష్ దాదా యెంతగా నచ్చజెప్పినా అతని భార్య అతని వద్దకు వచ్చేందుకు ఒప్పుకొనక ఢాకాలోనే వుండిపోయింది.

అమ్మ డెహ్రాడూన్ లో ఆనందచక్రము అని పిలువబడే ఒక శివాలయం ప్రక్కనే వున్న ఒక బంగాళాలో వుంటున్నారు. అమ్మ రాకతో డెహ్రాడూన్ నగర ప్రజలలో యెంతో మార్పు వచ్చింది. ఇతర ప్రాంతాల ప్రజలు కూడా అమ్మను దర్శించి భక్తి కార్యక్రమాలలో పాల్గొనసాగారు. అమ్మ ఆ ఊరిలోని కొన్ని ప్రాంతాలలో యజ్ఞకుండములను నిర్మింప చేశారు. అక్కడ యజ్ఞాగ్నిని రగిలింపజేసి తరచూ హోమములు చేసి ఆహుతులను సమర్పించాలని భక్తులకు ఆదేశాలు యిచ్చారు. ఆ హోమగుండములను జాగ్రత్తగా సంరక్షింపవలసినదిగా కొందరు భక్తులను అందుకోసం నియమించారు.

డెహ్రాడూన్ లో మనోహర మందిరము అనే పేరుగల శివాలయము, దాని ప్రక్కనే రాధాకృష్ణ మందిరము వున్నాయి. కృష్ణాష్టమి రోజున ఆ మందిరాలలో యెంతో ఘనంగా వుత్సవాలు జరుగుతాయి. అమ్మ ఆ రెండు మందిరముల మధ్య ప్రదేశంలో నాలుగు రాళ్లు పెట్టి యజ్ఞ కుండము నిర్మించి కృష్ణాష్టమి రోజున హోమాదికములు జరిపించారు. పెద్ద యెత్తున ఆహుతులు కూడా సమర్పించబడ్డాయి. పెద్ద యెత్తున సంతర్పణలు జరిగాయి. అసంఖ్యాక ప్రజలు ఆ రోజు జరిగిన వుత్సవములలో పాల్గొన్నారు. అక్కడ హోమము నిర్వహించిన తర్వాత కృష్ణాష్టమి మరుసటి రోజున అమ్మ రాధాకృష్ణ మందిరానికి వచ్చారు. ఆ యజ్ఞ కుండములోని బూడిదను కొంత సేకరించి మనోహర మందిరము ఆవరణలోని నేలలో ఒక ప్రదేశములో భూమి లోపల వుంచి అక్కడ కూడా ఒక యజ్ఞకుండాన్ని నిర్మింప చేశారు. ఏ సమయము లోనైనా యీ యజ్ఞ మందిరంలో భక్తులు హోమ కార్యక్రమములను జరుపుకొనవచ్చునని ప్రకటించారు అమ్మ. ఆ యజ్ఞ మందిర ప్రవేశద్వారము వద్ద ఆ మందిర నిర్వాహకులు 'శ్రీశ్రీ మాతా ఆనందమయివారి ఆగమన సందర్భంగా నిర్మింపబడ్డ బడిన యజ్ఞశాల' అనే వాక్యాలను శిలాఫలకంపై లిఖించడం జరిగింది.

మన స్వతంత్ర భారత ప్రథమ ప్రధానమంత్రి శ్రీ జవహర్ లాల్ నెహ్రూ గారి సతీమణి కమలా నెహ్రూ గారు శ్రీమాతా ఆనందమయి భక్తురాలు. ఆమెకు అమ్మపై వున్న భక్తి ప్రేమలు అపారం. ఆమె తరచూ అమ్మను దర్శిస్తుండేది. అయితే ఆమెకు డెహ్రాడూన్ లో కృష్ణాష్టమి వుత్సవాల సందర్భంగా అమ్మ హోమములు జరిపించిన విషయము తెలియదు. ఆ తర్వాత కొన్నాళ్లకు ఆ విషయం తెలిసి ఆ కార్యక్రమంలో తాను పాల్గొనలేకపోయినందుకు యెంతగానో చింతిస్తూ అమ్మకు వుత్తరం వ్రాసింది. "మాతాజీ తమరు రాధాకృష్ణ మందిరంలో కృష్ణాష్టమి రోజున జరిపించిన యజ్ఞ కార్యక్రమమునకు నన్ను పిలిపించుకొనలేదేమి? ఆ పుణ్య కార్య దర్శనభాగ్యాన్ని నేను కోల్పోయాను కదా!" అంటూ

ఆ వుత్తరం ద్వారా తన బాధను వ్యక్తం చేసింది. అమ్మ వెంటనే కమలా నెహ్రూను తన వద్దకు రావలసిందిగా వుత్తరం వ్రాయించగా కమలా నెహ్రూ డెహ్రాడూన్ వచ్చింది. అమ్మ ఆమెతో "నువ్వేమీ బాధపడనక్కరలేదు. నీకు యీ విధమైన యజ్ఞ కార్యక్రమాలు చేయాలనిపిస్తే యెప్పుడైనా నిరభ్యంతరంగా చేసుకొనవచ్చు. కృష్ణాష్టమి నాడు చేసుకోనందుకు చింతించవద్దు. ఎప్పుడు కావాలనిపిస్తే అప్పుడే జరిపించుకొనవచ్చు. అందుకు యెలాంటి సమయ నియమాలు ఆంక్షలు వుండవు" అన్నారు. ఆ మాటలు విని కమలా నెహ్రూ యెంతో ఆనందించి తనకు అమ్మ సన్నిధిలో అప్పుడే హోమ పూజ జరిపించాలని వున్నదని చెప్పగా అమ్మ అందుకు అంగీకరించారు. డెహ్రాడూన్ లోని రాజపూర్ రోడ్డులో కొండపైన 'అంబికా ఆలయము' అని పిలువబడే పార్వతి మాత ఆలయము వున్నది. యజ్ఞస్థలము ఆ ఆలయ మండపముగా నిర్ణయించారు అమ్మ. వెంటనే కమలా నెహ్రూ యజ్ఞ నిర్వహణకు కావలసిన వస్తువులను ఋత్విక్కులను కూడా సిద్ధం చేశారు. కమలా నెహ్రూ తో కలిసి అంబికా ఆలయానికి వెళ్లి అమ్మ యజ్ఞ కార్యక్రమమును యథావిధిగా జరిపించారు. యజ్ఞపూజలో తాను కూడా పాల్గొన్నారు. హోమగుండంలో ఎన్నో రకాల సమిధలు, రావి, వేప, మొదలైన వృక్షాల పుల్లలు, గంధపు చెక్కలు, పండ్లు, పువ్వులు, కర్పూరం, నవధాన్యాలు, ఆవు నెయ్యి, టెంకాయలు, ఎన్నో రకాల పరిమళ ద్రవ్యాలు ఆహుతులుగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వచ్చిన భక్తులందరికీ అన్న సంతర్పణ జరిగింది.

మూడు రోజులపాటు ఆ యజ్ఞాగ్నిని చల్లారిపోకుండా చూడవలసిందిగా అమ్మ భక్తులతో చెప్పారు. నాల్గవ రోజున ఆ అగ్నిని మనోహర మందిరంలోని యజ్ఞకుండములో కలిపివేశారు. ఆ యజ్ఞకుండములో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఆహుతులు సమర్పించాలని అమ్మ చెప్పారు. అలా కొన్ని రోజులు జరిగిన తర్వాత అమ్మ ఆ యజ్ఞాగ్నిని సంరక్షించేందుకు అల్మోడా నుండి ఒక భక్తుని (భైరవ్, అనగా పూజారి) పిలిపించి అగ్నిని అతని ఇంట్లో స్థాపించి, అక్కడ రోజు ఆహుతులు సమర్పిస్తూ అగ్ని పూజాకార్యక్రమం నిర్వర్తించవలసినదిగా ఆదేశించడం జరిగింది.

"ప్రతి ఒక్కరిలోనూ ఒక్కటే స్థితి వున్నది. అది స్థిరంగా యెప్పుడూ ఒకటిగానే వున్నది. ఒక్కటి మాత్రమే వున్నదన్న మాట నిజం. ఒక అడుగు తర్వాత మరొక అడుగు వేస్తాము. భుజించేటప్పుడు ఒక పదార్థం తర్వాత మరొక పదార్థాన్ని భుజిస్తాము. ఒక అక్షరం తర్వాత మరొక అక్షరాన్ని వ్రాస్తుంటాము. ఒకేసారి రెండు పనులను చేయడం వీలుపడదు. బాగా గమనించండి! మనం భోజనం చేసేటప్పుడు యెవరితోనైనా మాట్లాడుతూ చేస్తున్నట్లయితే, మాట్లాడే విషయంపై మనసు కేంద్రీకృతమైవుంటే తింటున్న పదార్థపు రుచిని పూర్తిగా ఆస్వాదించలేక పోతాము. తినే పదార్థంపై దృష్టి వుంటే మాట్లాడే విషయంపై శ్రద్ధ తగ్గి, అసంపూర్తిగా, అసంబద్ధంగా మాట్లాడుతూవుంటాము. కాబట్టి సృష్టికి మూలాధార శక్తి ఒక్కటే! ఆ ఒక్కదాని మీదే అంతా ఆధారపడి వున్నది. అంతటినీ నడిపిస్తున్నది ఒక్కటే! ఆ ఒక్కటి నుండే అంతా పుట్టింది ఆ ఒకటి లోనే కలిసిపోతుంది" అంటూ అమ్మ ఒకరోజు తత్త్వ రహస్యాన్ని తేలిక మాటలలో భక్తులకు వివరించారు.

రమణాశ్రమంలోని భక్తులు ముఖ్యంగా గురుప్రియ, శశాంకబాబు, యింకా యితరులు, కాశీ నుండి వచ్చిన మనోరమక్క - వీరంతా డెహ్రాడూన్ లో అమ్మ సన్నిధిలో సంతోషంగా కాలం గడుపుతుండగా చూస్తుండగానే నెలరోజుల కాలం గడిచిపోయింది. శ్రీ ఆనందమయి అమ్మ వీరిని తిరిగి తమ తమ ప్రాంతాలకు వెళ్లిపోవాల్సిందిగా చెప్పారు. ఒకరోజు అమ్మ గురుప్రియ, శశాంకబాబు, మనోరమలను పిలచి తన చెంతన కూర్చోబెట్టుకొని యిలా చెప్పారు: "మీరంతా డెహ్రాడూన్ నుండి వెళ్లిపోయి తిరిగి మీ మీ ప్రాంతాలలోనే స్థిరంగా వుంటూ యేకాగ్రతతో సాధనపై దృష్టిని కేంద్రీకరించండి. మిమ్మల్ని నాకు దూరంగా వుంచుతున్నానని బాధపడవద్దు. ఇదంతా మీ మంచి కోసమే చేస్తున్నానన్న విషయం అర్థం చేసుకోండి. ఇప్పుడు మీరు బాధపడినా, ముందు ముందు మీకు అన్ని విషయాలు స్పష్టంగా తెలుస్తాయి" అంటూ అమ్మ యెంతో అనునయిస్తూ నచ్చచెబుతున్నట్లుగా మాట్లాడారు. శ్రీ ఆనందమయి అమ్మ మనోరమకు, గురుప్రియకు, శశాంకబాబుకు వస్త్రధారణలో మార్పులను సూచించారు. పసుపు రంగు వస్త్రాలను మాత్రమే ధరించమని ముగ్గురికి చెప్పారు. మనోరమ, గురుప్రియలను బ్రహ్మచారిణి పద్ధతిలో

వస్త్రాలు ధరించవలసిందిగా చెప్పారు. అంచులు లేని చీరలు, రవికలు మాత్రమే ధరింపవలసిందిగా మనోరమా గురుప్రియ లను ఆదేశించారు. సాధన విధానాలలో మరికొన్ని నియమాలు సూచించారు. గురుప్రియతో "నువ్వు ప్రతిరోజు హోమము చేయి. హోమాగ్నిలో ఆహుతులు సమర్పించి యజ్ఞనివేదనను ప్రసాదంగా స్వీకరించు" అని ఆదేశించారు. శశాంకబాబును, మనోరమను, గురుప్రియను వింధ్యాచలం వెళ్లి అక్కడ తమ తపోసాధన కొనసాగించమని చెప్పారు. గురుప్రియ అసలు పేరు సుకర్ణి. అయితే ఇప్పుడు అమ్మ గురుప్రియ అనే పేరు పెట్టడం జరిగింది. అలాగే ఈ సందర్భంలో అమ్మ మనోరమ, శశాంకబాబు పేర్లను కూడా మార్చివేశారు మనోరమకు 'కృష్ణప్రియ' అని, శశాంక బాబుకు 'అఖండ స్వరూప్' అని పేర్లు పెట్టారు.

శ్రీ ఆనందమయి అమ్మ ప్రత్యేకంగా శశాంక బాబుకు యేకాంతంలో కొన్ని ఆదేశాలిచ్చారు. అందులో ముఖ్యమైనది యజ్ఞ మందిర నిర్మాణం. "వింధ్యాచలంలో ఒక యజ్ఞ మందిరాన్ని నిర్మించవలసివున్నది ఈ పని నీవే చేయాలి. నేను చెప్పే కొలతల ప్రకారం యజ్ఞ మందిర నిర్మాణం సిద్ధం చేయి. అక్కడ నిరంతర హోమాది కార్యక్రమాలు జరగవలసివున్నది. అవన్నీ యే సమయానికి ఆరంభం అవ్వాలని నిర్ణయింపబడివుంటే ఆ సమయానికి ఆరంభం అవుతాయి. నీవు మాత్రం యజ్ఞ మందిర నిర్మాణం పూర్తి అయిన వెంటనే నాకు తెలియజేయవలసి వుంటుంది" అని శశాంక బాబుతో చెప్పారు అమ్మ.

మాఘమాసం 1932వ సంవత్సరంలో ఒక రోజున గురుప్రియ, మనోర,మ శశాంక బాబు వింధ్యాచలం బయలుదేరారు. వింధ్యాచలం బయలుదేరే ముందు రోజున అమ్మ గురుప్రియ, శశాంక బాబు, మనోరమలతో స్త్రీల ఉపనయనం గురించిన విషయాలు చెప్పారు. ఆ విషయాల గురించి తెలుసుకొనటానికి వాళ్లను కాశీ వెళ్లవలసిందిగా చెప్పారు. "మీరంతా ముందుగా కాశీ పట్టణానికి వెళ్ళండి. స్త్రీలు యజ్ఞోపవీత ధారణ గురించి శాస్త్రాలు ఏమి చెబుతున్నాయో అక్కడి పండితులను అందరినీ అడిగి తెలుసుకొనండి. స్త్రీలు ఉపనయన సంస్కారానికి అర్హులా? - కాదా? శాస్త్రాలలో దీనిని గురించి ఋషులు యేమి చెప్పారు? దీనికి శాస్త్ర ప్రామాణ్యం యెక్కడ లభిస్తుంది? స్త్రీలు అర్హులు అన్న ప్రామాణ్యం కనుక వున్నట్లయితే ఉపనయన విధానాలు యేమిటి? ఇవన్నీ మీరు సవివరంగా తెలుసుకొని నాకు తెలియజేయండి. ఈ విషయమై పండిత గోపీనాథ్ గారిని కూడా సంప్రదించండి" అని వారిని ఆదేశించారు అమ్మ. శ్రీ ఆనందమయి అమ్మకు కొంతకాలంగా స్త్రీలకు ఉపనయం జరిపించాలన్న సంకల్పం వున్నట్లు అప్పుడప్పుడు అమ్మ మాటల్లో వ్యక్తం అవుతూ వుండేది. అమ్మ త్వరలో తన యీ సంకల్పాన్ని కార్యరూపంలోకి తీసుకురాబోతున్నారు అనడానికి యీ మాటలు సంకేతంగా మనం భావించవచ్చు.

శశాంకబాబు, గురుప్రియ, మనోరమ అమ్మ ఆదేశించినట్లు మొదట కాశీ వెళ్లారు. వాళ్లు కాశీలోని యెందరో పండితులను విడివిడిగా కలుసుకుని ప్రశ్నించారు "స్త్రీలకు ఉపనయన కాండ విషయంలో శాస్త్రం యేమి చెబుతున్నది? దీనికి ప్రమాణం యేమిటి" అని. అప్పుడు వారు ఈ విధంగా చెప్పారు.

"ప్రాచీన కాలంలో స్త్రీలకు ఉపనయన సంస్కారం జరుపబడుతుండేది. స్త్రీలు ఉపనయనం, జంధ్యా ధారణం, గాయత్రీ మంత్ర అనుష్ఠానం - వీటన్నిటికీ అర్హులు అని శాస్త్రం ధృవీకరించింది. అందువలన ప్రాచీన కాలంలో పురుషులకు లాగానే స్త్రీలకు కూడా ఉపనయనం చేసేవారు. అయితే అప్పటి కాలానుగుణంగా ఆనాటి పరిస్థితుల దృష్ట్యా ఆ సాంప్రదాయం ఆచరణ యోగ్యంగా వుండటం వలన యెటువంటి ఆటంకాలు లేకుండా కొనసాగింది. కానీ క్రమేణా కాలం మారింది. మారుతున్న మానవ ప్రవృత్తులు, జీవన విధానాలు, సమాజ పోకడలు - వీటిని దృష్ట్యా యిటువంటి సంప్రదాయాలను పాటించడానికి యిప్పటి పరిస్థితులు అనుకూలంగా లేవు. ఉపనయనం, గాయత్రీ మంత్ర అనుష్ఠానము అనేవి యీ కాలపు స్త్రీలు ఆచరించటం సాధ్యపడదు. అందువలన త్రికరణ శుద్ధిగా ఆచరింప వీలుపడని క్రతువులను బహిష్కరించడంలో దోషం లేదు. మేము స్త్రీలకు ఉపనయన క్రతువును సమర్థించము" అంటూ పండితులంతా యేకగ్రీవంగా తమ అభిప్రాయాన్ని తేల్చి చెప్పారు.

**- సశేషం**

# ద్వారకామాయి అనుభవమండపము

*శ్రీ రాజాలాల్, సూళ్లూరుపేట*

మా అబ్బాయి పేరు చందులాల్. ఇప్పుడు లండన్ లో ఉంటున్నాడు. మా అబ్బాయి ఉన్న ఇంటికి రెండు కిలోమీటర్ల దూరంలో బాబా గుడి ఉంటుంది. వాడు తరచూ అక్కడికి వెళుతూ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉంటాడు. ప్రతి రోజూ ఉదయం బాబావారికి అభిషేకం, అలంకరణ, ప్రసాదం తయారు చేయడంలో పాల్గొనడం ఇత్యాది సేవలు చేస్తూ ఉంటాడు.

క్రిందటి సంవత్సరం మా అబ్బాయికి గుండెకు శస్త్ర చికిత్స జరిగింది. 'పరిస్థితి చాలా విషమంగా ఉంది, మర్నాటి వరకు ఏమి చెప్పలేమని' అక్కడి వైద్యులు అన్నారు. మాకు ఈ విషయం తెలిసి చాలా ఆందోళన పడుతున్నాము. అక్కడ మా కోడలు పిల్లలు మాత్రమే ఉన్నారు. మర్నాడు ఉదయమే ఒక నర్సు వచ్చి మా అబ్బాయిని ఒకసారి పరీక్ష చేసి, ఏం ఫరవాలేదు అంతా బాగుంటుంది ధైర్యంగా ఉండమని తెలుగులో చెప్పి వెళ్లిపోయిందట. కాసేపటికి వైద్యులు వచ్చి మా కోడలితో, "అమ్మా! మీరు చాలా అదృష్టవంతులు, మీవారికి ప్రమాదం తప్పింది, రెండు రోజుల్లో ఇంటికి పంపిస్తాము" అని చెప్పారట. ఇంటికి వెళ్ళే రోజున మా వాళ్ళు, ఆరోజు మా అబ్బాయికి ధైర్యం చెప్పిన నర్సు ని, కలిసి వెడదామన్న ఉద్దేశంతో, ఆమెకోసం అక్కడి వాళ్ళని అడిగితే, "ఇక్కడ తెలుగు వచ్చిన నర్సులు ఎవరూ లేరు, అసలు వుండరు కూడా" అని చెప్పారట. బాబానే నర్సు రూపంలో వచ్చి తనని ప్రమాదం నించి తప్పించారని మా అబ్బాయికి కృతజ్ఞతతో కళ్ళు చెమర్చాయి. శ్రీ సాయినాథుని దయకు చాలా ఆనందపడుతూ ఇల్లు చేరారు.

అతి తక్కువ రోజులు మాత్రమే విశ్రాంతి తీసుకొని, మా అబ్బాయి బాబా గుడికి సేవకు వెళ్లిపోయాడు. ఎప్పటిలాగే ఉదయం బాబా కి అభిషేకం చేస్తుంటే, బాబా గుండెల మీద కొన్ని చారలు కనిపించాయట(తన గుండెలమీద శస్త్ర చికిత్స చేసిన గుర్తులు ఎక్కడ ఉన్నాయో, అక్కడే బాబాకి కూడా ఉన్నాయిట). ఇవేమిటని అక్కడున్న వాళ్ళని అడిగితే, 'అయ్యో, ఇన్ని రోజులు మేము గమనించనే లేదు' అని వాళ్ళు కూడా అవి చూసి చాలా ఆశ్చర్యపోయారట. అదే రోజు రాత్రి శ్రీబాబావారు మా అబ్బాయికి స్వప్న దర్శనమిచ్చి, "నీ బాధని నేను తీసుకున్నాను" అని చెప్పారట. బాబా కృపకి అంతకన్నా నిదర్శనం ఏం కావాలి?

మొన్న కరోనా సమయంలో మనందరం చాలా ఇబ్బంది పడ్డాం. అది అందరి అనుభవం. దాని బారినపడి నా భార్య చెల్లెలు కూడా మరణించింది. మేమందరం చాలా జాగ్రత్తలు తీసుకుంటూ భయపడుతూ అలాగే ఎవరి ఇళ్లల్లో వాళ్ళు పారాయణలు, ఆన్‌లైన్‌లో సత్సంగాలు చేసుకుంటూ రోజులు గడుపుతున్నాం. ఒకరోజు నా శ్రీమతి అనురాధకి స్వప్నంలో శ్రీ బాబావారు దర్శనమిచ్చి, "అమ్మా, గోధుమ పిండిని తీసుకుని వెళ్లి, మీ దగ్గరలో ఉన్న నదిలో కలిపి రండి" అని ఆదేశించారు. మా ఊర్లో కాళింది నది పాయ ఉన్నది. మరునాడు మన సత్సంగ సభ్యులందరికీ ఈ విషయం చెప్పి, శ్రీబాబాగారు చెప్పినట్టే గోధుమపిండి




తీసుకెళ్లి అందరం కలిసి, కాళింది నదిలో కలపడం జరిగింది. తర్వాత మాకు ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగలేదు.

నేను వివాహానికి ముందు నుంచే బాబాగారి పారాయణ, సేవ చేసుకునేవాడిని. మా ఊరిలో పూజ్యశ్రీ మాస్టరుగారి సత్సంగాలు 30 సంవత్సరాల నుంచి నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయి. పూజ్యశ్రీ మాస్టరుగారు కూడా సూళ్లూరుపేటలోని మా ఇంటికి విచ్చేసి మమ్మల్ని అనుగ్రహించారు. ఈ విధంగా గురు కుటుంబంతో మా అనుబంధం కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతోంది. నాకు పెళ్లయిన కొత్తలో నేను పారాయణం చేసుకోవడం చూసి మా ఆవిడ 'అయ్యో, నేను కూడా పారాయణ చేసుకోగలిగితే బాగుంటుంది కదా!' అని బాధపడేది. ఎందుకంటే తను ఎక్కువగా చదువుకోలేదు. అప్పుడు ఒకరోజు శ్రీ బాబావారు ఆమెకు స్వప్నంలో కనిపించి, "అమ్మా, నువ్వు కూడా పారాయణం మొదలుపెట్టు, బాగా చదువుతావులే, బాధపడకు" అని చెప్పారు. రెండో రోజు కూడా మళ్లీ స్వప్న దర్శనమిచ్చి అలాగే చెప్పారు. అప్పటినుంచి ఆమె పారాయణ చేయటం మొదలుపెట్టింది. చక్కగా చదవగలిగింది. ఇప్పటి కూడా పారాయణ కొనసాగుతూనే ఉంది, శ్రీ బాబాగారి దయవల్ల!!

మా ఇంటి నించి ప్రతిరోజూ గుడికి బాబావారికి మధ్యాహ్నభోజనం తీసుకువెళ్లడం ఆనవాయితీ. ఒకరోజు నా శ్రీమతి ఊరికి వెడుతూ, శ్రీబాబావారికి భోజనం సిద్ధంచేసి, గుడికి వెళ్ళేటప్పుడు తీసుకెళ్ళమని టేబుల్ మీద పెడితే, నేను వేరే పని హడావిడిలో ఆరోజు ప్రసాదం తీసుకువెళ్లడం మర్చిపోయాను. తీరా నేను కంచంలో అన్నం పెట్టుకుని తినబోయే సమయానికి ఆజానుబాహుడైన ఒక వ్యక్తి మా ఇంటిముందు ప్రత్యక్షమై అన్నం పెట్టమని అడిగారు.(ఎప్పుడూ మా ఇంటివైపు బిచ్చగాళ్ళు రారు). నాకు తెలియకుండానే బాబావారి కోసం సర్దిన అన్నమే పెట్టాను. "ఎప్పుడూ ఇలాగే అన్నం పెడుతూవుండు" అని ఆశీర్వదించి వెళ్లారు. ఇంట్లోకి వెడుతూ వారిచ్చిన ఆశీర్వచనానికి బాహ్య స్పురణలోకి వచ్చిన నేను, వెనుతిరిగేసరికి వారక్కడలేరు.

ఇలా మా జీవితాల్లో ప్రతి సంఘటన వెనుక శ్రీ సాయినాథుని అపారకరుణ మాపై ప్రసరించి ఏమారక మమ్మల్ని ముందుకు నడిపిస్తోంది.

జై సాయి మాస్టర్!!

# ఆచార్యుని అద్భుత లీలలు

**శ్రీ రాఘవ శ్రీకాంత్**

పూజ్య భరద్వాజ గురుదేవుల లీలావైభవాన్ని ఒంగోలుకు చెందిన శ్రీ రాఘవ శ్రీకాంత్‌గారు ఈ విధంగా తెలియజేస్తున్నారు:

మా నాన్నగారైన నందనవనం నాగేశ్వరరావుగారు పూజ్యశ్రీ మాస్టరుగారి సత్సంగాలకి హాజరవుతూ ఉండేవారు. ఒంగోలులో ఇప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంటికి రెండు వీధులు వెనకాల మా ఇల్లు ఉంది. అప్పట్లో పూజ్యశ్రీ మాస్టరుగారు వారి ఇంటి స్థలం కొనే నిమిత్తం మా ఇంటి వైపు నుంచి మా నాన్నగారితో కలిసి వెళ్లడం జరిగేదట. అప్పుడు మా అమ్మగారు వారిని దర్శించుకుని నమస్కరించుకునేవారట. వారి చూపు మా ఇంటి మీద పడడం వల్లనేమో, మా ఇంట్లో ఇప్పటికీ వారి గ్రంథాల పారాయణ, మరెన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతూ ఉంటాయి. మా ఇంట్లో అందరికీ వారిపై ప్రత్యేకమైన పూజ్యభావన! నేను కూడా ఇంచుమించు పదవ తరగతి నుంచి పారాయణ మొదలుపెట్టాను.

నేను బి.టెక్. చదువుతున్నప్పుడు, అరికాళ్ళ మంటలతో చాలా బాధపడేవాడిని. రాత్రుళ్ళు ఆ బాధ ఎక్కువై నిద్ర పట్టేదికాదు. ప్రతిరోజు మా నాన్నగారు ఒక పది నిమిషాలు కాళ్ళమీద నిలబడి తొక్కితేనే కానీ నేను పడుకునే వాడిని కాదు. ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. ఇలా జరుగుతున్న సమయంలో మా స్నేహితుడితో ఒకసారి ఈ సమస్య గురించి చెప్పాను. అప్పుడతను, "బస్-స్టాండ్ వెనుకవైపు ఒక హోమియోవైద్యులు వున్నారు. నువ్వు వారి దగ్గరకి వెళ్లు, మంచి మందు ఇస్తారు" అని చెప్పాడు. సరేనని మర్నాడు ఉదయమే 9 గంటలకు డాక్టరుగారు వస్తారంటే ఒక పది నిమిషాలు ముందరే ఆ క్లినిక్ దగ్గరకి చేరుకున్నాను. రోడ్డు దాదాపు నిర్మానుష్యంగా ఉంది. నేను హోమియో క్లినిక్ అరుగు మీద కూర్చొని డాక్టర్ గారి కోసం ఎదురు చూస్తున్నాను. నా పక్కనే తెల్లటి చొక్కా, తెల్లటి పంచె ధరించి సుమారు 50, 55 సంవత్సరాల వయసున్న ఒక ఆయన కూర్చుని వున్నారు. ఆయన నన్ను, "ఇలా వచ్చావేమిటి నాన్నా?" అని అడిగారు. "నాకు అరికాళ్ళు మంటలుగా ఉంటాయి, హోమియో మందు తీసుకోవడానికి వచ్చాను" అని చెప్పాను. అప్పుడు, "అలాగా! అయితే ఒకపని చెయ్యి, సుందరయ్యభవన్ రోడ్డులో సురేష్ అని ఒక హోమియో డాక్టరు ఉన్నారు. నువ్వు వారి దగ్గరికి వెళ్ళు, నీకు తప్పకుండా వ్యాధి నయమవుతుంది. తప్పకుండా తగ్గుతుంది" అని రెండు మూడు సార్లు నా కళ్ళల్లోకి చూసి చెప్పారు. నాక్కూడా అక్కడికి వెళ్ళిపోవాలని చాలా బలంగా అనిపించి వెంటనే స్కూటర్ స్టార్ట్ చేయడానికి మెట్లు దిగి, థాంక్స్ చెబుదామని తల పైకెత్తి చూస్తే ఆయనక్కడ లేరు!! ఇప్పటిదాకా ఎదురుగావున్న ఆయన ఏమైపోయారని చుట్టూ చూసాను. ఎక్కడాలేరు. వారితో మాట్లాడుతున్నంతసేపు ఎక్కడో చూసినట్టే అనిపించింది. అలా ఒక నిమిషం ఆ బండి దగ్గరే ఇవన్నీ ఆలోచిస్తూ నిల్చున్నాను, అప్పుడు అర్థమైంది ఆయన పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరు గారని!! నాకు ఒక్కసారిగా ఒళ్ళు గగుర్పొడిచింది. ఆశ్చర్యం, ఆనందం ఇలా రకరకాల భావాలతో పులకించిపోయాను. వెంటనే అక్కడనించి బయలుదేరి డాక్టరు సురేష్ గారి దగ్గరికి వెళ్లాను. నేను వెళ్లిన కొంతసేపటికి డాక్టరుగారు వచ్చారు. నా సమస్య చెప్పిన వెంటనే, "నా గురించి మీకు ఎవరు చెప్పారు?" అని అడిగారు. నాకు ఏం చెప్పాలో అర్థం కాలేదు. ఇప్పుడు జరిగినది చెప్తే వారు నన్నెలా అర్థం చేసుకుంటారోనని, ఒక నిమిషం ఆగి, "మీకు భరద్వాజ మాస్టరుగారు తెలుసా?" అని అడిగాను "తెలుసును, మా నాన్నగారు వారికి పరమ భక్తులు. వారు ఈతముక్కలలో హోమియో డాక్టర్ గా చేసేవారు, వారిప్పుడు లేరు" అని చెప్పి, "ఇంతకీ ఏం జరిగింది?" అని

అడిగారు. అప్పుడు జరిగిన విషయమంతా చెప్పాను. వారు చాలా ఆనందపడ్డారు. వాళ్ళ నాన్నగారు పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారు ఎంతో గొప్పవారని, మహాత్ములని చెప్తూ ఉండేవారని చెప్పి, నా సమస్యకి హోమియో మందు ఇచ్చారు. రెండు సంవత్సరముల నుంచి బాధపడుతున్న నేను, వారి మందులు వాడిన రెండు నెలలకే వ్యాధి పూర్తిగా తగ్గిపోయి చాలా హాయిగా ఉన్నాను. అప్పటినుంచి నాకు పూజ్యశ్రీ మాస్టరుగారి మీద ఎంతో భక్తి గౌరవాలు ఏర్పడ్డాయి. తరవాత నించి, స్వయంగా పూజ్యశ్రీ మాస్టరుగారు సూచన చేశారు కనుక, చాలా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఎందరినో డాక్టర్ సురేష్ గారి దగ్గరకి పంపిచాను. అందరికీ నయమయ్యింది.

ఒకరోజు మా పడకగదిలో ఉన్న బాబా ఫోటోని తదేకంగా చూస్తుంటే, 'బాబా, మాస్టరుగారు ఒకటేనా' అన్న భావన కలిగి దాని గురించి ఆలోచిస్తూ బాబా వైపు చూస్తున్నాను. కొద్దిసేపటికి ఫోటోలో బాబా రూపం పోయి ఆస్థానే పూజ్యశ్రీ మాస్టరుగారు ఆకుపచ్చ శాలువా ఒక భుజంపైన వేసుకుని కూర్చున్న రూపం కనపడింది. నేను పూర్తిగా మెలకువతో ఉన్నాను. అది స్వప్నం కాదు! అలాగే కళ్ళప్పగించి చూస్తూ, వెంటనే లేచి వారి పాదాలకి నమస్కారం చేసుకుందామని ఆ పటం దగ్గరికి వెళ్లేసరికి మామూలుగా బాబా రూపం ఆ స్థానంలో వచ్చేసింది. 'స్మృతిమాత్ర ప్రసన్నాయ' అన్నట్లు ఒక్క చిన్న ఆలోచనకి ఎంత పెద్ద అనుభవాన్ని ప్రసాదించారోనని ఆనందంతో హృదయమంతా నిండిపోయింది.

ఒకసారి మా కుటుంబ సభ్యులందరం పుట్టపర్తి దర్శనం చేసుకుందామని ఉదయమే బయలుదేరాం. అక్కడి నుంచి గోకర్ణం వెళ్లాలని ప్రణాళిక. మేము పుట్టపర్తి చేరేసరికి సుమారు 10:45 అయింది. పుట్టపర్తి సాయిబాబా సమాధి మందిరం గేటు దగ్గరికి వెళ్లేసరికి కొంతమంది అక్కడ మమ్మల్ని ఆపేశారు. "ఉదయం 7 గంటల నుంచి 10:30 వరకు మాత్రమే సమాధి దర్శనం వేళలు. తిరిగి మళ్ళీ సాయంత్రం 4గంటలకి అవకాశం ఉంటుంది, కనుక ఇప్పుడు లోపలకి వెళ్లడానికి కుదరదు" అని చెప్పారు. మాకు ఈ నియమాలు తెలియవు కనుక, ఆ సంగతి వాళ్ళకి తెలియచేసి, సాయంత్రం వరకు వుండే అవకాశం లేదని చెప్పుకుని, ఒక్కసారి పంపిస్తారా అని అడిగితే, "ఇదేం అనుకుంటున్నారు? పుట్టపర్తి! ఇక్కడ చాలా క్రమశిక్షణ పాటిస్తాము. అసలు పంపించే ప్రసక్తే లేదు" అని చెప్పారు. సరేనని, పూజ్యశ్రీ మాస్టరుగారు, అక్కల్ కోట స్వామి చరిత్రలో పుట్టపర్తి బాబా గురించి రాసినది స్మరించుకుని, పూజ్యశ్రీ మాస్టరుగారి నామం చేసుకుంటూ అక్కడే కూర్చున్నాము. ఒక పది నిమిషాలకి లోపల నుంచి ఒకాయన గబగబా వచ్చి, "వాళ్ళని లోపలికి పంపించండి, స్వామి ఆదేశం అయింది" అని చెప్పారు. అక్కడున్న వాళ్ళందరూ ఆశ్చర్యపోయారు. ఊహించని ఈ పరిణామానికి నాకు చాలా ఆశ్చర్యం వేసింది. వెంటనే గేటు తీశారు. మేము లోపలికి వెళ్లి స్వామి సమాధిని దర్శించుకున్నాము. ఇది పూజ్యశ్రీ మాస్టరుగారు చేసిన అద్భుతమైన లీల!!

నేను ఒంగోలు QIS కళాశాలలో ఎలక్ట్రానిక్స్ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాను. పూజ్యశ్రీ మాస్టరుగారి రచనలు 'ఏది నిజం?', 'మతం ఎందుకు?', 'విజ్ఞానవీచికలు' గ్రంథాలు నన్నెంతగానో ఆకర్షించాయి. విద్యార్థులతో ఈ గ్రంథాలలోని విషయాలు అప్పుడప్పుడూ చర్చిస్తూ వుండేవాడిని. వారికి ఆసక్తి కలిగి వీటి గురించి పదే పదే అడుగుతుండడంతో, సాయంత్రం 6గంటల తరవాత మా ఇంటికి వస్తే మాట్లాడుకుందామని చెప్పాను. ఆసక్తి కలిగిన కొందరు విద్యార్థులు ప్రతిరోజూ మా ఇంటికి రావడం జరిగింది. ఇలా ఒక యేడాది క్రితం మొదలై ఒక సత్సంగంగా రూపుదిద్దుకుని ఇప్పటికీ కొనసాగుతోంది.. ఇవేకాక పూజ్యశ్రీ మాస్టరుగారు రచించిన ఇతర గ్రంథాలు కూడా చదువుకోవడం జరుగుతోంది.

మా సత్సంగ సభ్యులం కొంతమంది కలిసి పూజ్యశ్రీ మాస్టరుగారు సూచించిన దత్త క్షేత్రాల దర్శనం చేసుకున్నాము. సత్సంగ సభ్యులందరికి చక్కటి అనుభవాలు కూడా కలుగుతున్నాయి. ఒకసారి సత్సంగంలో అక్కల్ కోట స్వామి గ్రంథం పారాయణ పూర్తి చేసుకున్నాక, అక్కల్ కోట స్వామి పాదుకలు మన ఇంటికి రావడం జరిగింది. స్వామి కృపకి, ఆ కృప పొందడానికి కారణమైన పూజ్యశ్రీ మాస్టరుగారికి ఎప్పటికీ కృతజ్ఞులమై ఉంటాము.

ఈవిధంగా, నా చిన్నప్పటినించి నన్ను చేయిపట్టుకుని నడిపిస్తూ, నాపై అనుగ్రహవర్షం కురిపిస్తున్న భరద్వాజ గురుదేవులకి శత సహస్రకోటి నమస్సులు తెలియచేసుకుంటున్నాను.

జై సాయి మాస్టర్!!

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271
*Send DD in favour of 'Sri Manga Bharadwaja Trust (Publications)' Payable at Hyderabad or Ongole*

**శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹199.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

**శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹199.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹20.00 |

**ఇతర మహాత్ముల గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి (రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |
| అవధూత శ్రీ చివటం అమ్మ (రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |

**అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు**

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

**ధ్యాన సంబంధమైన గ్రంథములు**

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

**ఆధ్యాత్మికత - తత్వచింతనా పూర్వక గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹199.00 |

**ఇతర గ్రంథములు**

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

**పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹149.00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ (రచన : శ్రీమతి శ్రీదేవి) | ₹299.00 |
| మహా పురుషుడు (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹60.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1 (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2 (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| ఆచార్య అమృత లేఖావళి (సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹199.00 |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹99.00 |

**బాలల కొరకు విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹49.00 |
| బాలల సాయిసన్నిధి (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |
| బాలల శ్రీ గురు చరిత్ర (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |

**BOOKS IN ENGLISH**

| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master *(Author: Smt. Adidam Vedavati)* | ₹80.00 |

**BOOKS IN OTHER LANGUAGES**

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |



గుమ్మళంపాడు గ్రామశివారులో గల శ్రీ అలివేలుమంగమ్మ దివ్య సన్నిధానము లో డిసెంబరు 15వ తేదీన శ్రీ దత్త జయంతి వేడుకలు - అభిషేకము, అలంకరణ, పూజ, సత్సంగము, భజన మొదలైన కార్యక్రమాలతో - ఘనంగా జరిగాయి.

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Printed and published by Dr. R.S. Sasidhar on behalf of E. Vikramaditya and printed at Vanaja Printers, Vijayawada and published at Sri Manga Bharadwaja Trust, Ongole (523002) - Editor: Dr. R.S. Sasidhar.
Postal Registration Number : Prakasam/16/2024-2026, Regd.No. 37926/83.



పరాడసింగా శ్రీఅనసూయ మాత ఆరాధన

(10.01.2025)

IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET, KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.